
aruhi group
BBTV
BBTV TELUGU
BBTVNETWORK

తెలుగు దినపత్రిక
నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
గురువారం
05-03-2026 సంపుటి : 01 సంచిక : 34 పేజీలు : 08 వెల : ₹5/- RNI NO : TGTEL/26/A0738

Published From HYDERABAD,VIJAYAWADA తెలంగాణ , ఆంధ్రప్రదేశ్. www.mahaaprabha.com MAHAAPRABHA.DAILY

BESQATI
besqati.com
Contact : info@besqati.com



## ఇరాన్ యుద్ధ నౌకను
# ముంచేసిన అమెరికా

- 32 మందిని కాపాడిన శ్రీలంక నావికాదళం
- చైనా, రష్యా ఖండన
- లెబనాన్‌లో ఇజ్రాయిల్ విస్తృత దాడులు
- 11 మంది మృతి
- ఖమేనీ అంత్యక్రియలు వాయిదా
- ఇరాన్‌లో 1000 దాటిన మృతుల సంఖ్య

### 83 మంది మృతి

టెహరాన్, టెల్ అవీవ్ – మార్చి 4 (మహాప్రభ )
: ఇరాన్‌పై యుద్ధోన్మాదంతో రగిలిపోతున్న అమెరికా బుధవారం నాడు మరో ఘాతుకానికి తెగబడింది. శ్రీలంక తీరానికి సమీపంలోని జలాంతర్గామి ద్వారా దాడి చేసి ఇరాన్ యుద్ధనౌకను ముంచేసింది. ఈ మేరకు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేథ్ ప్రకటించారు. ఈ దాడిలో 83 మంది చనిపోయారు. అయితే శ్రీలంక సకాలంలో స్పందించి 32 మంది ప్రాణాలను రక్షించి యుద్ధ నీతిని చాటుకుంది. కాగా ఐదురోజులుగా అమెరికా, ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న అమానవీయ దాడుల్లో ఇరాన్‌లో వెయ్యి మంది పైగా చనిపోయినట్లు కథనాలు వస్తున్నాయి. ఇరాన్ యుద్ధ నౌకను ముంచేయడాన్ని చైనా, రష్యా తీవ్రంగా ఖండించాయి. ఈ నేపథ్యంలో పశ్చిమాసియా వ్యాప్తంగా ఉద్రిక్తతలు మరింతగా పెరుగుతున్నాయి.


**సకాలంలో శ్రీలంక జోక్యం**

కాగా జలాంతర్గామి దాడి ద్వారా ఇరాన్ యుద్ధనౌకను అమెరికా ముంచేస్తున్న సమయంలో శ్రీలంక యుద్ధనీతి చాటుకుంది. సాకంలో జోక్యం చేసుకొని మునిగిపోతున్న ఇరాన్ యుద్ధ నౌక నుండి 32 మంది కాపాడింది. ఈ విషయాన్ని శ్రీలంక నావికా దళం ప్రకటించింది. అందులో ఒకరి పరిస్థితి విషమంగా వుందని, వారికి చికిత్స అందుతోందని తెలిపింది. వీరితో పాటు కొన్ని మృతదేహాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. ఇందులో నౌకా సిబ్బంది కూడా వున్నట్లు భావిస్తున్నారు. శ్రీలంక సముద్ర జలాల పరిధికి ఆవల ఈ సంఘటన జరిగినా, వారికి మద్దతునందించడానికి ముందు కొచ్చామని నావికాదళ ప్రతినిధి తెలిపారు. ప్రస్తుతం ప్రాణరక్షణపైనే దృష్టి కేంద్రీకరించామని, తర్వాత దర్యాప్తుపై దృష్టి పెడతా మని తెలిపారు. ఇరాన్ యుద్ధ నౌక మునిగి పోవడానికి కారణాలేమిటన్నది కూడా వెంటనే తెలియ రాలేదు. అయితే, జలాంతర్గామి దాడి కారణమని భావిస్తున్నట్లు అంతకుముందు శ్రీలంక నావిక, రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ సంఘటనపై శ్రీలంక విదేశాంగ మంత్రి విజితా హెరాత్ పార్లమెంట్‌లో మాట్లాడుతూ..

-మిగతా 3 లో




## చమురు సంక్షోభం
## తలెత్తకుండా రష్యా సాయం..




2 లో

## ఇరాన్-ఇజ్రాయెల్
## యుద్ధంలోకి పాకిస్తాన్..?

- సౌదీ అరేబియాపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోం:
- ఇరాన్‌కు పాకిస్తాన్ స్ట్రాంగ్ వార్నింగ్.
- సౌదీ రక్షణ కోసం పాక్ అణ్వాయుధాలు బయటకు వస్తాయా?
- అమెరికా కంటే పాకిస్తాన్‌నే నమ్ముకున్న సౌదీ అరేబియా!



3 లో



### యంగ్ ఇండియా స్కూల్స్
## టెండర్లలో అవినీతి

- త్వరలోనే వివరాలు బయటపెడతాం
- జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను పక్కన పెట్టారు
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్, – మార్చి 4 (మహాప్రభ )
యంగ్ ఇండియా స్కూల్స్‌లో జరిగిన అవినీతి అంతా ఇంతా కాదు.. అన్ని ఆధారాలు ఉన్నాయి. త్వరలో అన్ని బయట పెడుతానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ప్రభుత్వ పనితీరుపై హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. యంగ్ ఇండియా స్కూల్స్‌లో ఎవరికి ఎక్కువ టెండర్లు ఇచ్చారో అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. పరిపాలనలో ముఖ్యమంత్రికి పట్టు రావడం లేదని.. మేము ప్రతిపక్షంగా సక్సెస్ అయ్యామని పేర్కొన్నారు.

-మిగతా 3 లో



### ప్రపంచానికి
## ఇరాన్ షాక్..

- చైనా నౌకలకు మాత్రమే 'గ్రీన్ సిగ్నల్'!
- హోర్ముజ్ జలసంధి దాటితే నౌకలకు పేల్చివేస్తామని ప్రపంచ దేశాలకు ఇరాన్ హెచ్చరికలు.
- ఇరాన్ నిర్ణయంతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు సెగలు!


న్యూఢిల్లీ- మార్చి 4 (మహాప్రభ )
ఇజ్రాయెల్ , అమెరికా దాడులతో ఇరాన్ లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైన, పొరుగుదేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన దాడులు చేస్తున్నది. ఈ దాడులు, ప్రతి దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్.. ఇందన సరఫరాలో ప్రపంచ జీవనాడి అయిన హోర్ముజ్ జలసంధిని మూసివేసింది.ఆ జలసంధి గుండా వెళ్లేందుకు ప్రయత్నించే చమురు నౌకలను పేల్చివేస్తామని హెచ్చరికలు కూడా చేసింది. కొన్ని నౌకలపై దాడులు కూడా చేసింది. దాంతో హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణ అనుమతి కోసం భారీ సంఖ్యలో చమురు నౌకలు వేచి ఉన్నాయి. ఈ క్రమంలో చైనా చమురు నౌకలకు మాత్రం జలసంధి గుండా వెళ్లేందుకు ఇరాన్ అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది.

-మిగతా 3 లో

## ఐపీఎస్‌ల సంఖ్యను
# 105కు పెంచండి

**పెరుగుతున్న జనాభా, హైదరాబాద్ విస్తరణతో తెలంగాణకు మరింత మంది ఐపీఎస్‌లు అవసరం**

- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- మావోయిస్టుల అంశంపై నివేదిక అందజేసిన ముఖ్యమంత్రి
- తెలంగాణ పోలీసులను అభినందించిన అమిత్ షా
- ఈగల్ టీమ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచన





న్యూఢిల్లీ/– మార్చి 4 (మహాప్రభ )
తెలంగాణ రాష్ట్రానికి అదనంగా ఐపీఎస్‌లను కేటాయించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. పెరిగిపోతున్న సైబర్ నేరాలు, డ్రగ్స్, వైట్ కాలర్ నేరాలను అరికట్టడం, శరవేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్, పెరుగుతున్న జనాభా, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ, కొత్తగా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ఏర్పాటు నేపథ్యంలో తెలంగాణకు మరింత మంది ఐపీఎస్ అధికారులు అవసరమని వివరించారు. బుధవారం ఢిల్లీలో అమిత్ షాతో ఆయన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ శివధర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ అదనపు డీజీపీ విజయ్‌కుమార్, ఎస్ఐబీ ఐజీపీ బి.సుమతి సుమారు గంటన్నర పాటు భేటీ అయ్యారు.

-మిగతా 3 లో

## విరోష్ జోడీ పెళ్ళి రిసెప్షన్

- హాజరైన సినీ, రాజకీయ ప్రముఖులు
- విజయ్- రష్మిక వివాహం ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్‌లో జరిగిన సంగతి తెలిసిందే

3 లో






### ఊపందుకున్న
## 'బాయ్‌కాట్ చాట్‌జీపీటీ'

- 25 లక్షల మంది ఇప్పటికే బహిష్కరణ
- అమెరికాతో ఒప్పందమే కారణం

న్యూఢిల్లీ,– మార్చి 4 (మహాప్రభ )
బాయ్‌కాట్ చాట్‌జీపీటీ నినాదం ఊపందుకుంటోంది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే ఆ చాట్‌బాట్‌ను 25 లక్షల మంది బహిష్కరించారని ఈ కార్యక్రమాన్ని ట్రాక్ చేస్తున్న వెబ్‌సైట్ పేర్కొంది. అమెరికాతో గత వారం ఓపెన్‌ఏఐ ఒప్పందం చేసుకోవడమే బాయ్‌కాట్‌కు కారణం. ఆ దేశ రక్షణ శాఖ తన క్లాసిఫైడ్ నెట్‌వర్క్‌లో ఓపెన్‌ఏఐకు చెందిన ఏఐ మోడల్‌ను వినియోగించేందుకు ఆ ఒప్పందం జరిగింది. యుద్ధరంగంలలో దీనిని వాడతారనే ఆందోళనతో యూజర్లు బాయ్‌కాట్‌కు పిలిపునిస్తున్నారు. ఈ ఒప్పందం నుంచి ఆంథ్రోపిక్ తప్పుకున్న

-మిగతా 3 లో



### భారత్ చేరుకున్న
## ఫిన్‌లాండ్ అధ్యక్షుడు

**విమానాశ్రయంలో స్టబ్‌కు ఘనంగా స్వాగతం**

న్యూఢిల్లీ, – మార్చి 4 (మహాప్రభ )
ఫిన్‌లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ భారత్ విచ్చేశారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం మధ్యాహ్నం ఆయన ఢిల్లీ చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఆధ్వర్యంలోని బృందం ఘన స్వాగతం పలికింది. గార్డ్ ఆఫ్ ఆనర్ లభించింది. స్టబ్‌తోపాటు ఫిన్‌లాండ్‌కు చెందిన పలువురు కీలక నేతలు, అధికారులు కూడా ఇండియా చేరుకున్నారు. స్టబ్ తన పర్యటన సందర్భంగా ఇండియాతో కీలక ఒప్పందాలు చేసుకుంటారు.

-మిగతా 3 లో

## ఇది మనిషి సృష్టించిన పెను విషాదం

**ఇరాన్‌లో పాఠశాల బాలికల మృతిపై కేటీఆర్**



హైదరాబాద్, – మార్చి 4 (మహాప్రభ )
ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. ఇజ్రాయెల్, అమెరికా బలగాలు వైమానిక దాడులతో ఇరాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైన, తన పరిసర దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన ప్రతిదాడులు చేస్తోంది.

-మిగతా 3 లో

## జైలు నుంచి విడుదలయిన బాల్క సుమన్



- క్యాతనపల్లిలో మంత్రి వివేక గూండాగిరీ
- మీడియా ముందు బాల్క సుమన్ ఆరోపణలు

ఆదిలాబాద్,– మార్చి 4 (మహాప్రభ )
బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదిలాబాద్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నిక సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ సహా బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులో జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేయడంతో ఆయన బయటకొచ్చారు. బాల్క సుమన్‌తో పాటు రాజారెడ్డి, అనిల్, లక్ష్మీకాంత్ బెయిల్‌పై విడుదలయ్యారు.

-మిగతా 3 లో

నమస్తే మహాప్రభ

# చమురు సంక్షోభం తలెత్తకుండా రష్యా సాయం..

**- ఇండియాకు భారీగా చమురు సరఫరా**

**న్యూఢిల్లీ- మార్చి 4 ( మహాప్రభ )**
ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో చమురు రవాణాపై నీలిమేఘాలు కమ్ముకున్న సంగతి తెలిసిందే. దీంతో ఇండియా సహా అనేక దేశాలకు చమురు సరఫరా ఆగిపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇండియాకు తగినంత చమురు సరఫరా చేసేందుకు రష్యా సిద్ధమైంది. ప్రస్తుతం ఇరాన్ యుద్ధం వల్ల హోర్ముజ్ జలసంధిలో రవాణా నిలిచిపోయింది. ముఖ్యంగా చమురు రవాణా ఆగిపోయింది. చమురు నౌకలు కదిలే పరిస్తితి లేదు. ఇండియాకు 40 శాతం చమురు ఈ హోర్ముజ్ జలసంధి ద్వారానే వస్తుంది.అలాంటిది ఈ సంధి మార్గంలో చమురు రవాణా ఆగిపోతే ఇండియా తీవ్ర చమురు సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఎందుకంటే ఇండియా దగ్గర 25 రోజులకు సరిపడా మాత్రమే ఆయిల్ నిల్వలు ఉన్నాయని సమాచారం. ఆ తర్వాత చమురు వాడుకోవాలంటే కొత్తగా ఆయిల్ రావాల్సిందే. అందుకే మన దేశంలో ఆయిల్ సంక్షోభం




తలెత్తకుండా రష్యా ముందుకొచ్చింది. ఇండియాకు రష్యా 9.6 మిలియన్ల బ్యారెళ్ల క్రూడాయిల్‌ను అందించనుంది. ఈ మేరకు రష్యా చమురు నౌకలు ఇండియాకు బయల్దేరినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భారత సముద్ర జలాల్లోనే ఈ నౌకలుండగా, మరికొద్ది రోజుల్లోనే ఈ నౌకలు ఇండియాకు చేరుకోనున్నాయి. అయితే, రష్యా నౌక ఎక్కడ ఉందనే సమాచారం మాత్రం తెలియదు. రష్యా గతంలో మనకు తక్కువ ధరకే చమురు అందించేది. కానీ, ప్రస్తుతం మార్కెట్ ధరకే చమురు అందించేందుకు సిద్ధమైంది. అలాగే లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ కూడా అందిస్తామని రష్యా ప్రకటించింది. ఇటీవల అమెరికా ఆంక్షలు, వాణిజ్య ఒప్పందంలో భాగంగా రష్యా నుంచి ఇండియా చమురు కొనుగోళ్లు తగ్గించినట్లు సమాచారం. గత జనవరిలో రష్యా నుంచి ఇండియా 1.1 మిలియన్ల బ్యారెళ్ల చమురు మాత్రమే దిగుమతి చేసుకుంది. ఇది నవంబర్ 2022 నుంచి అత్యల్పం. మిడిల్ ఈస్ట్‌లో మరో రెండు వారాలు యుద్ధం కొనసాగినా ఆయిల్‌పై ప్రభావం పడకుండా ఇండియా ప్రయత్నిస్తోంది. ఇండియన్ గ్యాస్ కంపెనీలు ప్రతి రోజూ 5.6 మిలియన్ బ్యారెళ్ల చమురును శుద్ధి చేస్తాయి. అయితే, ఇప్పుడు తగినంత ఆయిల్ సరఫరా కావడం లేదు. ఇక.. ఇండియా.. ప్రపంచంలోనే మూడో చమురు వినియోగ దేశం. ప్రస్తుత సంక్షోభం నేపథ్యంలో భారతీయ కంపెనీలు పలు పరిశ్రమలకు చమురు సరఫరాను తగ్గించాయి.

# సీఎం పదవి కోసం విప్లవం చేయాల్సిన అవసరం లేదు

**న్యూఢిల్లీ- మార్చి 4 ( మహాప్రభ )**
కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి చర్చకు వచ్చింది. దీనిపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం స్థానం దక్కాలంటే విప్లవం లేవనెత్తాల్సిన అవసరం లేదని, కాలమే నిర్ణయిస్తుందని అన్నారు. పార్టీ కోసం తాను చేస్తున్న కృషి అందరికీ తెలుసని చెప్పారు. ఏ సమయంలో తనకు ఏ స్థానం ఇవ్వాలనే విషయంపై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని అన్నారు.కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సహా పార్టీ కేంద్ర నాయకత్వం కర్ణాటక సీఎం మార్పుపై చర్చలు జరిపినట్లు వస్తున్న వార్తల గురించి తనకు ఎలాంటి




సమాచారం లేదన్నారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై తానెప్పుడూ బహిరంగంగా ప్రకటనలు చేయలేదని శివకుమార్ చెప్పారు. ఆ పదవి ఖాళీ అయినప్పుడే మరొకరికి అవకాశం వస్తుందని తెలిపారు. తాను ప్రజల కోసం పలు పోరాటాలు చేశానని, కానీ పదవి కోసం ఎప్పుడూ పోరాడలేదని చెప్పారు. సీఎం స్థానం కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు మధ్య విభేదాలు నెలకొన్నట్లు వస్తున్న వార్తలను సిద్ధరామయ్య కొట్టిపారేశారు. అవన్నీ ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలని అన్నారు. డీకే శివకుమార్‌కు మద్దతుగా ఉన్న ఎమ్మెల్యేల ఫోన్లను తాను ట్యాపింగ్ చేయించినట్లు విపక్ష నేత అశోక్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలు-తేనె వంటి తమ బంధాన్ని ఎలాగైనా నాశనం చేయాలనే ఉద్దేశంతోనే వారు తనపై అసత్య ఆరోపణలు

# బిహార్ రాజకీయాల్లో కీలక మలుపు..

**రాజ్యసభకు బిహార్ సీఎం నితీష్ కుమార్..?**

**న్యూఢిల్లీ- మార్చి 4 ( మహాప్రభ )**
బిహార్ రాజకీయాలు కీలక మలుపు తిరగబోతున్నాయా..? తాజా ప్రచారం చూస్తుంటే ఔనని అనిపిస్తోంది. బిహార్ సీఎంగా ఉన్న నితీష్ కుమార్ సీఎం పదవికి రాజీనామా చేసి, రాజ్యసభకు వెళ్లబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే నిజమైతే బిహార్ రాజకీయాల్లో సంచలనం రేగడం ఖాయం. ప్రస్తుతం ఎన్డీయే ఆధ్వర్యంలోని ఉమ్మడి ప్రభుత్వం కొలువుదీరి ఉంది. బిహార్‌లో నితీష్ కుమార్ (జేడీయూ) సీఎంగా కొనసాగుతున్నారు.ఒప్పందంలో భాగంగా ఆయనకు సీఎం పదవి దక్కింది. కానీ, కూటమిలోని బీజేపీకి ఎక్కువ అసెంబ్లీ స్థానాలున్నాయి. 243 అసెంబ్లీ స్థానాలకుగాను ఎన్డీయేకు 202 సీట్లున్నాయి. అందులో అత్యధికంగా బీజేపీకి 89, ఆ తర్వాత జేడీయూకు 85, కూటమిలోని మిగతా పార్టీలకు 28 సీట్లు



దక్కాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవి నుంచి నితీష్ తప్పుకొంటారనే ప్రచారం జరుగుతోంది. ఆయనను రాజ్యసభకు పంపాలని జేడీయూ, బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం దీనికి కావాల్సిన ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేశారు. జేడీయూ కూడా దీనిపై అంగీకారం తెలిపింది. రాజ్యసభకు నితీష్ నామినేషన్ వేసేందుకు తగిన పత్రాలు కూడా సిద్ధమయ్యాయి. ఆయన సంతకం పెడితే చాలు.. నామినేషన్ వేసేందుకు రంగం సిద్ధమైంది. బిహార్ నుంచి జేడీయూ తరఫున రెండు రాజ్యసభ స్థానాలకు అవకాశం ఉంది. అందులో రామనాథ్ ఠాకూర్‌ను ఒక అభ్యర్థిగా ఖరారు చేశారు. రెండో అభ్యర్థి విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ రెండో స్థానంలోనే నితీష్ రాజ్యసభకు వెళ్లే అవకాశం ఉంది. నితీష్ దీనికి పూర్తిగా అంగీకరిస్తే గురువారం నాడే నామినేషన్ దాఖలు చేస్తారు. ఇదే జరిగితే నితీష్ బిహార్‌లో చేపట్టబోయే మలిదశ 'సమృద్ధి యాత్ర' వాయిదా పడొచ్చు. ఈ యాత్ర ఈ నెల 8న ప్రారంభం కావాలి. నితీష్ రాజ్యసభకు వెళ్తే సీఎం పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. దీంతో బిహార్‌కు కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకోవాలి. ఈసారి ఆ స్థానాన్ని కూటమిలో అత్యధిక స్థానాలున్న బీజేపీ తీసుకుంటుంది. ఆ పార్టీ అభ్యర్థి నూతన సీఎం అవుతారు. రాష్ట్ర రాజకీయాల నుంచి నితీష్ జాతీయ రాజకీయాల్లోకి అడుగుపెట్టాలనుకోవడం కూడా ఆయన రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకోవడానికి కారణమని తెలుస్తోంది. దీనిపై త్వరలోనే స్పష్టత రానుంది.

# ఖమేనీ వారుసుడెవరైనా .. ఏరివేతే మా టార్గెట్: ఇజ్రాయెల్

**టెల్ అవివ్ - మార్చి 4 ( మహాప్రభ )**
ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ వార్నింగ్ ఇచ్చారు. అలీ ఖమేనీ స్థానంలో ఇరాన్ ఎవర్ని నియమించినా.. ఆ వ్యక్తే తమ టార్గెట్ అవుతారని ఇజ్రాయెల్ పేర్కొన్నది. ఇరాన్‌కు చెందిన ఉగ్రవాద పాలకులు తమ నేతగా ఎవర్ని నియమించినా.. వారిని అంతం చేస్తామన్నారు. ఇజ్రాయెల్‌కు కానీ, అమెరికాకు కానీ ఆ వ్యక్తి వ్యతిరేకంగా ఉన్నా , లేక ఇరానీ ప్రజలను హింసించినా, తాము ఊరుకోబోమన్నారు. అతని



పేరెంటన్న విషయం అవసరం లేదని, అతను ఎక్కడ దాక్కున్నా ఏరివేస్తామని కట్జ్ తన వార్నింగ్‌లో వెల్లడించారు.అమెరికా భాగస్వాములతో కలిసి తాము పూర్తిగా దాడి చేస్తామన్నారు. అయితే ఖమేనీ స్థానంలో అతని కుమారుడు మోజ్తాబాను ఇరాన్ సుప్రీం నేతగా ఎన్నుకున్నట్లు తాజాగా ఓ మీడియా కథనం ద్వారా తెలిసింది.

# మా పార్టీ ఎప్పుడూ యుద్ధానికి అనుకూలం కాదు..

**సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్**



**న్యూఢిల్లీ- మార్చి 4 ( మహాప్రభ )**
తమ పార్టీ ఎప్పుడూ యుద్ధాలకు అనుకూలం కాదని సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ అన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో చాలా ప్రాంతాల్లో యుద్ధాలు జరుగుతున్నాయని, ఆ యుద్ధాలు ఆగకుండా కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇవాళ ఉదయం ఎట్టావా లో తన అభిమానులతో కలిసి హోలీ సంబురాలు జరుపుకున్న అఖిలేష్.. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశం ఒకటి మరో దేశ అధ్యక్షుడిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లిందని, ఎవరికి కూడా ఇలాంటిది జరగకూడదని అఖిలేష్ యాదవ్ అన్నారు. వెనెజువెలా అధ్యక్షుడు మధురోను అమెరికా సైన్యం ఎత్తుకెళ్లడాన్ని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్య చేశారు. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధం భారత ప్రజలపై కూడా ప్రభావం చూపుతుందని అన్నారు. సమాజ్‌వాది పార్టీ ఎన్నడూ యుద్ధాలకు అనుకూలం కాదని చెప్పారు.

# హోర్ముజ్ జలసంధి గుండా చైనా చమురు నౌకలకు మాత్రమే అనుమతి..!



**న్యూఢిల్లీ- మార్చి 4 ( మహాప్రభ )**
ఇజ్రాయెల్, అమెరికా దాడులతో ఇరాన్ లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పైన, పొరుగుదేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైన దాడులు చేస్తున్నది. ఈ దాడులు, ప్రతి దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్.. ఇందన సరఫరాలో ప్రపంచ జీవనాడి అయిన హోర్ముజ్ జలసంధిని మూసివేసింది.ఆ జలసంధి గుండా వెళ్లేందుకు ప్రయత్నించే చమురు నౌకలను పేల్చివేస్తామని హెచ్చరికలు కూడా చేసింది. కొన్ని నౌకలపై దాడులు కూడా చేసింది. దాంతో హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణ అనుమతి కోసం భారీ సంఖ్యలో చమురు నౌకలు వేచి ఉన్నాయి. ఈ క్రమంలో చైనా చమురు నౌకలకు మాత్రం జలసంధి గుండా వెళ్లేందుకు ఇరాన్ అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది .మధ్యప్రాచ్యంలో యుద్ధం మొదలైనప్పటి నుంచి చైనా.. ఇరాన్‌పట్ల సానుభూతి చూపుతుండటంతో అందుకు ప్రతిఫలంగా ఇరాన్ చైనా నౌకలకు అనుమతి ఇచ్చిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా ప్రపంచ దేశాల నడుమ చమురు సరఫరాకు హోర్ముజ్ జలసంధి కీలకం. ఈ జలసంధి పర్షియన్ గల్ఫ్ తీరాలను ఓపెన్ సముద్రంతో కలిపే కీలక చోక్ పాయింట్. ఈ జలసంధిని మూసివేయడం వల్ల గ్లోబల్ సప్లయ్ చైన్‌కు విఘాతం కలుగుతుంది.

# నేడు నేపాల్ ఎన్నికలు



**ఖట్మాండు : న్యూఢిల్లీ- మార్చి 4 ( మహాప్రభ )**
నేపాల్‌లో గురువారం నాడు సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. నేటు ఓటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. నేపాల్ జనాభా సుమారు 3 కోట్లు కాగా, ఇందులో సుమారు 1.9 కోట్ల మంది ఓటర్లు. ఓటర్లలో ఎక్కువ మంది యువతే ఉన్నారు. నేపాల్‌లో గతేడాది సెప్టెంబరులో జరిగిన జెన్ జెడ్ ఆందోళనల తరువాత అక్కడి ప్రభుత్వం కూలిపోయిన సంగతి తెలిసిందే. దీంతో షెడ్యూల్ కంటే రెండు ఏళ్లు ముందుగా జరుగుతున్న ఈ ఎన్నికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ ఎన్నికలను రాజకీయ మార్పు కోసం అన్వేషణగా విశ్లేషకులు భావిస్తున్నారు. నేపాల్‌లో లోక్‌సభగా భావించే ప్రతినిధి సభలో 275 మంది సభ్యులు ఉంటారు. వీరిలో 165 మంది సభ్యులు ఫస్ట్ పాస్ట్ ది పోస్టు (ఎఫ్‌పిటిపి) ద్వారా ఎన్నికవుతారు. మిగిలిన 110 మంది ప్రోపోర్షినల్ రిప్రసెంటేషన్ (పిఆర్) ద్వారా సభకు వెళ్తారు. అంటే రాజకీయ పార్టీలకు దేశ్యా వ్యాప్తంగా వచ్చిన ఓట్ల ఆధారంగా ఈ సీట్లు కేటాయిస్తారు. అంటే నేపాల్‌లో ఓటర్లు రెండు ఓట్లు వేస్తారు. ఒకటి ఆ నియోజకవర్గంలో అభ్యర్థికి, రెండోది పిఆర్ కింద పార్టీకి. ఈ కారణంగా నేపాల్‌లో ఓట్ల లెక్కింపు సుదీర్ఘంగా జరుగుతుంది. పూర్తి ఫలితాలను వెల్లడించానికి కనీసం ఒక నెల రోజులు పడుతుంది.

### యంగ్ ఇండియా స్కూల్స్

## టెండర్లలో అవినీతి

మొదటి తరువాయి

ఖమ్మంకు కేటీఆర్ వెళ్లారు.. ఇప్పుడు స్థలాలు ఇస్తాం.. ఇండ్లు కట్టిస్తాం అన్నారు. నేను శారదా పీఠం వెళ్లాను.. అది ఆపుతున్నాం అన్నారు. దేవాదుల ప్రాజెక్టు వెళ్లాం. వెంటనే ముఖ్యమంత్రి కూడా వెళ్లారు. హెల్త్ సిటీకి వెళ్లాం ప్రతి దానికి మేము వెళ్లాక స్పందిస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. జర్నలిస్టుల హెల్త్ స్కీంను గాలికి వదిలేశారని.. మేము ఉన్నప్పుడు ప్రత్యేక జీవో ఇచ్చాం. ఉద్యోగులకు ఎలా ఉండేదో అలానే జర్నలిస్టులకు ఉండేదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి మేనల్లుడి మనుషులు నియో పోలీస్‌లో అక్రమ మైనింగ్ చేస్తున్నారు. మొబైల్ క్రషింగ్ ప్లాంట్‌కు మాత్రమే నిబంధనలుండగా ఫిక్స్డ్ క్రషింగ్ ప్లాంట్ నియోపోలీస్‌లో పెట్టారు. ల్యాండ్ లీజుకు ఇస్తే 6 నుంచి 7 శాతం ఫీజు కట్టాలి. లెటర్‌లో పది ఎకరాలు ఇస్తే 15 ఎకరాల్లో మైనింగ్ జరుగుతోందని.. 15 లక్షల క్యూబిక్ మీటర్ల బండకు ఫీజు ఎగ్గొట్టారని హరీష్ రావు ఆరోపించారు. అక్కడ రెడీమిక్స్‌కు పర్మిషన్ లేదన్నారు.

## ప్రపంచానికి ఇరాన్ షాక్..

మొదటి తరువాయి

మధ్యప్రాచ్యంలో యుద్ధం మొదలైనప్పటి నుంచి చైనా.. ఇరాన్‌పట్ల సానుభూతి చూపుతుండటంతో అందుకు ప్రతిఫలంగా ఇరాన్ చైనా నౌకలకు అనుమతి ఇచ్చిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా ప్రపంచ దేశాల నడుమ చమురు సరఫరాకు హార్ముజ్ జలసంధి కీలకం. ఈ జలసంధి పర్షియన్ గల్ఫ్ తీరాలను ఓపెన్ సముద్రంతో కలిపే కీలక చోక్ పాయింట్. ఈ జలసంధిని మూసివేయడం వల్ల గ్లోబల్ సప్లయ్ చైన్‌కు విఘాతం కలుగుతుంది.

## ఇరాన్ యుద్ధ నౌకను ముంచేసిన అమెరికా



మొదటి తరువాయి

గాలె తీర ప్రాంతానికి 40 నాటికల్ మైళ్ళ దూరంలో 'ఐఆర్ఐఎస్ దేనా' అనే నౌకను గుర్తిం చామని చెప్పారు. ఆ నౌక నుండి వచ్చిన విపత్తు సందేశాన్ని అందుకుని వెంటనే నావికా, వైమానిక బలగాలతో రంగంలోకి దిగామని తెలిపారు. వెంటనే శ్రీంక బలగాలు గాలింపు, సహాయక చర్యలు చేపట్టాయి. ఆ సమయంలో ఆ నౌకలో 180 మంది వున్నట్లు తెలుసోందని, 32 మంది కాపాడామని, మరికొన్ని మృత దేహాలను కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

**లెబనాన్‌లో 11మంది మృతి**

తాజాగా లెబనాన్‌లో ఇజ్రాయిల్ దాడులను విస్తరించింది. బీరుట్ సమీపంలోని అధ్యక్ష భవన సముదాయం, ఆ చుట్టుపక్కల ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుంది. అలాగే బీరుట్‌కు దక్షిణంగా గల ప్రాంతాలను కూడా లక్ష్యంగా చేసుకుని దాడులను ముమ్మరం చేసింది. ఈ దాడుల్లో ఇప్పటివరకు 11మంది మృతి చెందారు. ఇరాన్ మద్దతు వున్న హిజ్బుల్లాపై పదాతి దాడులను ప్రారంభించింది. ఇందులో భాగంగా లెబనాన్‌లోని దక్షిణ పట్టణమైన ఖయామ్‌లో ఇజ్రాయిల్ ఆర్మీ ప్రవేశించింది. నివాస భవంతిపై దాడులు జరిపినట్లు మీడియా వార్తలు తెలిపాయి. హిజ్బుల్లాపై సైనికచర్య తీసుకుంటున్నందున ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాళని ఇజ్రాయిల్ మిలటరీ హెచ్చరికలు జారీ చేసింది. టెహరాన్‌పై తాజాగా పలు దాడులు జరిపినట్లు తెలిపింది. ఇదిలావుండగా సెంట్రల్ ఇజ్రాయిల్ లోని ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ ప్రధాన కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు హిజ్బుల్లా ప్రకటించింది. గత రాత్రి డ్రోన్ దాడులు జరిపామని, తాజాగా క్షిపణి దాడులు కూడా చేశామని తెలిపింది.

# ఐపీఎస్‌ల సంఖ్యను 105కు పెంచండి

మొదటి తరువాయి

ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించిన పలు కీలక భద్రతా అంశాలు, పోలీస్ విభాగం బలోపేతం, మావోయిస్టుల అంశంపై చర్చించారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2016లో మొదటిసారి ఐపీఎస్ క్యాడర్ రివ్యూ జరిగిందని, 2021లో జరగాల్సిన రివ్యూ ఆలస్యంగా 2025లో జరిగిందని.. ఆ సమయంలోనూ ఏడుగురు ఐపీఎస్‌లను మాత్రమే తెలంగాణకు కేటాయించారని అమిత్ షాకు సీఎం వివరించారు. మూడో క్యాడర్ రివ్యూను నిర్దేశిత సంవత్సరమైన 2026లోనే చేపట్టాలన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 83 ఐపీఎస్ అధికారులు ఉన్నారని.. వారి సంఖ్యను 105కు పెంచాలని కోరారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను కేంద్ర మంత్రి దృష్టికి సీఎం రేవంత్ తీసుకెళ్లారు. ముఖ్యంగా ఈగల్ ఫోర్స్ కార్యకలాపాలు, సైబర్ నేరాలు, సైబర్ సవాళ్లను ఎదుర్కోవడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోషిస్తున్న క్రియాశీలక పాత్రను వివరించారు. ఇక వెనుకబడిన జిల్లాల్లో అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి అందాల్సిన సాయంపైనా చర్చ జరిగింది. ఈ మేరకు నిధులు ఇవ్వాలని అమిత్ షాను సీఎం రేవంత్‌రెడ్డి



కోరారు.

**మావోయిస్టుల అంశంపై సుదీర్ఘ చర్చ**

రాష్ట్రంలో మావోయిస్టుల అంశం, ప్రభుత్వం అనుసరించిన వ్యూహాలు, దక్కిన ఫలితాలు, మావోయిస్టుల లొంగుబాటు, పునరావాసం తదితర అంశాలపైనా అమిత్ షాకు రేవంత్‌రెడ్డి నివేదికను అందజేశారు. రాష్ట్రంలో గత రెండేళ్లలో గణనీయమైన మార్పులు వచ్చాయని, 591 మంది మావోయిస్టులు లొంగిపోయారని.. ఇది మంచి పరిణామమని అమిత్ షాకు సీఎం, పోలీసు ఉన్నతాధికారులు వివరించారు. తెలంగాణ నుంచి మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్నది కేవలం 11 మందేనని రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు కేంద్ర మంత్రికి వివరించారు. లొంగిపోయిన మావోయిస్టులు వెల్లడించిన భవిష్యత్ కార్యాచరణ వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పోలీసులను కేంద్ర మంత్రి అమిత్‌షా అభినందించారు. ఆపరేషన్ కగార్‌కు మంచి సహకారం అందించారని, ఆపరేషన్ పూర్తయ్యే వరకు ఇలాగే కొనసాగాలని, మిగతా మావోయిస్టులు కూడా లొంగిపోయేలా చూడాలని చెప్పారు. తెలంగాణలో ఈగిల్ టీమ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఇక తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, బెంగాల్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ తదితర మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల పోలీసులు, నాయకులు కూడా కేంద్ర హోంమంత్రితో భేటీ అయ్యారు.

## ఇది మనిషి సృష్టించిన పెను విషాదం

మొదటి తరువాయి

ఫలితంగా పశ్చిమాసియాలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఈ నేపథ్యంలో ఈ మారణహోమంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కామెంట్ చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఓ బాలికల పాఠశాల నేలమట్టమవగా.. ఆ శిథిలాల కింద చిక్కుకుని 165 మంది బాలికలు ప్రాణాలు కోల్పోయారు. ఇవాళ వారి అంత్యక్రియలు విషాదకరంగా జరిగాయి. ఈ నేపథ్యంలో.. 'పాఠశాలపై ఇజ్రాయెల్, అమెరికా బలగాలు జరిపిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన 165 మంది బాలికల అంత్యక్రియలకు సంబంధించిన భయంకరమైన, మనసును కలచివేసే దృశ్యాలు..' అని పేర్కొంటూ కేటీఆర్ ఆ మరణించిన బాలికల సామూహిక సమాధుల దృశ్యాన్ని తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. యుద్ధం ఆవశ్యకత గురించి చెబుతున్న ఉద్దేశాలు ఏవైనా ఇది మనిషి సృష్టించిన విషాదమేనని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ యుద్ధం రాబోయే తరాలకు బాధను, విషాదాన్ని మాత్రమే మిగిల్చుతుందని తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు.

## భారత్ చేరుకున్న ఫిన్‌లాండ్ అధ్యక్షుడు

మొదటి తరువాయి




ఈ మేరకు అనేక అంశాలపై చర్చలు జరపనున్నారు. ముఖ్యంగా ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపారం, వాణిజ్యం, సాంకేతిక రంగంలో సహకారం వంటి అంశాల్లో ఒప్పందాలు జరుగుతాయి. స్టబ్స్.. ఈ చర్చల్లో భాగంగా గురువారం ప్రధాని మోదీతో చర్చలు జరుపుతారు. అలాగే, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో కూడా సమావేశమవుతారు. స్టబ్స్ ఇండియాలో పర్యటిస్తున్న సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. స్టబ్స్‌కు స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. స్టబ్స్ పర్యటన ఇరు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి ఉపయోగపడుతుందని, గురువారం ఆయనను కలుసుకునేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. భారత పర్యటనపై స్టబ్ కూడా ప్రత్యేకంగా స్పందించారు. భారత పర్యటనపై హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ములను కలుసుకోబోతున్నట్లు వెల్లడించారు. గురువారం సాయంత్రం మీడియాతో మోదీ, స్టబ్ మాట్లాడుతారు. ఫిన్‌లాండ్ ప్రధాని పె÷-టటెరి ఒర్పో ఇటీవలే ఇండియాలో పర్యటించారు. న్యూఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఇక.. ఇండియా, ఫిన్‌లాండ్ మధ్య చాలాకాలంగా స్నేహపూర్వక సంబంధాలున్నాయని భారత విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అన్నారు.

## విరోష్ జోడీ పెళ్ళి రిసెప్షన్

**హాజరైన సినీ, రాజకీయ ప్రముఖులు**

**విజయ్- రష్మిక వివాహం ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్‌లో జరిగిన సంగతి తెలిసిందే**



హైదరాబాద్, మార్చి 4 ( మహాప్రభ )

విజయ్ దేవరకొండ- రష్మిక వెడ్డింగ్ రిసెప్షన్ బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో విరోష్ జోడీ మెరిసింది. చేతిలో చెయ్యి వేసుకుని హాజరైన ఇచ్చిన ఈ జంట.. తొలుత అతిథులను పలకరించి, తర్వాత సెలబ్రేషన్స్‌లో పాల్గొంది. ఓ హోటల్‌లో ఏర్పాటైన ఈ వేడుకకు సినీ, రాజకీయ తదితర రంగాల ప్రముఖులు హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీత, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, టాలీవుడ్ నుంచి చిరంజీవి, వెంకటేశ్, అక్కినేని నాగార్జున దంపతులు, నాగచైతన్య, రామ్‌చరణ్ దంపతులు, నాని కుటుంబం, నవీన్ పొలిశెట్టి, దర్శకుడు సుకుమార్ ఫ్యామిలీ, నిర్మాత దిల్‌రాజు ఫ్యామిలీ, నమ్రతా శిరోద్కర్, ఆమె కుమార్తె సితార, రాధిక-శరత్‌కుమార్ దంపతులు, హాజరయ్యారు. విజయ్- రష్మిక వివాహం ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్‌లో జరిగిన సంగతి తెలిసిందే. తరవాత వారి సొంతూరులో సత్యానారయాణ వ్రతం నిర్వహించారు. తరవాత అభిమానులకు పార్టీ కూడా ఇచ్చారు.

## జైలు నుంచి విడుదలయిన బాల్క సుమన్

మొదటి తరువాయి

ఈ సందర్భంగా బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌ను ఎలా పంపించారని అడిగితే పోలీసులు తమపై లాఠీ చార్జి చేశారని పేర్కొన్నారు. వాళ్లు దాడి చేస్తే.. మాపైనే రివర్స్‌లో కేసు పెట్టారని మండిపడ్డారు. ఈ ఘటనలో 22 మందిపై అక్రమ కేసులు పెట్టారని చెప్పారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో కేవలం 7 స్థానాల్లో మాత్రమే గెలిచిన కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ పీఠం ఎలా వస్తుందని మండిపడ్డారు. ప్రజా తీర్పును మంత్రి వివేక్ గౌరవించడం లేదని విమర్శించారు. జిల్లాలోని కలెక్టర్ నుంచి తహశీల్దార్ వరకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగుల్లా కాకుండా విశాఖ ఇండస్ట్రీస్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో వికృత క్రీడ ప్రారంభించారని బాల్క సుమన్ అన్నారు. జైలు లోపల కూడా తమను ఇబ్బంది పెట్టారని వెల్లడించారు. నిన్న హోలీ, ఇవాళ నా కొడుకు పుట్టిన రోజు.. ఈ టైమ్‌లో నన్ను ఇంట్లో లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడూ కక్ష సాధింపు చర్యలకు దిగలేదని తెలిపారు. అందర్నీ కలుపుకుపోయాం తప్ప.. కక్ష సాధింపు చేయలేదని స్పష్టం చేశారు

## ఊపందుకున్న 'బాయ్‌కాట్ చాట్‌జీపీటీ'

మొదటి తరువాయి

వెంటనే ఓపెన్‌ఏఐతో ఒప్పందం జరగడం వివాదమైంది. వెబ్‌సైట్ సిగ్నేచర్లు, సోషల్ మీడియాలో షేర్లు, యాప్ వాడకం డేటాను బట్టి చూస్తే చాట్‌జీపీటీకి యూజర్లు వేగంగా దూరం అవుతున్నారని ట్రాకింగ్ వెబ్‌సైట్ అంచనా వేసింది. చాట్‌జీపీటీని బహిష్కరించాలని అమెరికన్లకు, ప్రపంచవ్యాప్త యూజర్లకు చెబుతున్నామని ఆ వెబ్‌సైట్ పేర్కొంది. చాట్‌జీపీటీని రక్షణాత్మక పరిస్థితిలోకి నెట్టడం వల్ల ఐసీఈ ఎనేబర్లకు కూడా ఓ ఉదాహరణగా ఉంటుందని తెలిపింది. కాగా, యాపిల్ స్టోర్ డేటాను బట్టి చూస్తే ఆంత్రోపిక్ చాట్‌బాట్ క్లాడ్, చాట్‌జీపీటీని దాటి దూసుకెళుతోంది. రోజురోజుకు చాట్‌జీపీటీ అన్‌ఇన్‌స్టాలేషన్లు 295 శాతం పెరిగాయని టెక్ క్రంచ్ నివేదిక స్పష్టంచేసింది. ఎదురుదెబ్బ తగిలిన తర్వాత ఓపెన్‌ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మన్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. తమ ఒప్పందం చాలా తక్కువ సమయంలో కుదిరిందని, తొందరపడకుండా ఉండాల్సిందని చెప్పారు. ఉద్రిక్తతను తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆ ఒప్పందాన్ని మార్చడానికి కంపెనీ ప్రయత్నిస్తోందని ది గార్డియన్ పత్రిక తెలిపింది.

# ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలోకి పాకిస్తాన్..?

- సౌదీ అరేబియాపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోం:
- ఇరాన్‌కు పాకిస్తాన్ స్ట్రాంగ్ వార్నింగ్.
- సౌదీ రక్షణ కోసం పాక్ అణ్వాయుధాలు బయటకు వస్తాయా?
- అమెరికా కంటే పాకిస్తాన్‌నే నమ్ముకున్న సౌదీ అరేబియా!




న్యూఢిల్లీ- మార్చి 4 ( మహాప్రభ )

ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికా యుద్ధంలోకి పాకిస్తాన్ కూడా అడుగుపెడుతుందా..? దీనిపై పాక్ వైపు నుంచి ఔననే సమాధానమే వినిపిస్తోంది. ఈ మేరకు పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దర్ వార్నింగ్ కూడా ఇచ్చేశాడు. అయితే, పాక్ రంగంలోకి దిగబోయేది ఇరాన్‌కు మద్దతుగా కాదు. వ్యతిరేకంగా. సౌదీ అరేబియాపై ఇరాన్ దాడి చేస్తున్న సంగతి తెలిసిందే. సౌదీ అరేబియా.. పాకిస్తాన్‌కు సన్నిహిత దేశం. ముఖ్యంగా ఇరు దేశాల మధ్య భద్రత, రక్షణ పరమైన ఒప్పందం ఉంది. వేరే ఏ దేశమైనా ఈ రెండింటిలో ఏ ఒక్క దేశంపై దాడి చేసినా.. మిగతా దేశం దానికి మద్దతుగా నిలవాలి. ఈ అంశంలో సౌదీ అరేబియాతో పాకిస్తాన్ గతంలోనే ఒప్పందం కుదుర్చుకుంది. సౌదీపై వేరే దేశం దాడి చేస్తే పాక్ మద్దతుగా.. పాకిస్తాన్‌పై ఏ దేశమైనా దాడి చేస్తే సౌదీ మద్దతుగా రావాలి. ఈ లెక్కన ప్రస్తుతం సౌదీపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడుతోంది. దీంతో సౌదీ అరేబియాకు మద్దతుగా పాకిస్తాన్ రంగంలోకి దిగాలి. ఈ ఒప్పందాన్ని స్ట్రాటజిక్ మ్యూచువల్ డిఫెన్స్ అగ్రిమెంట్ (ఎస్ఎండీఏ)గా పేర్కొంటారు. దీనిపైనే పాక్ విదేశాంగ మంత్రి కీలక వ్యాఖ్యలు చేశాడు. సౌదీతో తమకు రక్షణ, భద్రతాపరమైన ఒప్పందం ఉందని ఇరాన్‌కు తెలుసని, అవసరమైతే తాము కూడా సౌదీ అరేబియాకు మద్దతుగా యుద్ధంలోకి దిగే అవకాశం ఉందని ఇషాక్ దర్ అభిప్రాయపడ్డాడు. పాకిస్తాన్ నుంచి ఈ యుద్ధంపై వచ్చిన స్పష్టమైన ప్రకటన ఇది. ఇప్పటికిప్పుడు సౌదీకి మద్దతుగా యుద్ధం చేస్తామని పాక్ ప్రకటించకపోయినా, ఈ విషయంలో తమ వైఖరి మాత్రం ఇదేనని పాక్ స్పష్టం చేసింది. ఈ ఒప్పందానికి సంబంధించి పాక్ అణ్వస్త్రాలు కూడా ప్రయోగిస్తుందా అనే విషయంలో స్పష్టత లేదు. ఎందుకంటే పాక్ వద్ద అణ్వాయుధాలున్నాయి. నిజానికి గత ఏడాది కుదిరిన ఎస్ఎండీఏ వివాదాస్పదమైంది. అణు ఆయుధాలు కలిగిన దేశంతో ఇలాంటి ఒప్పందం చేసుకోవడంపై విమర్శలు చెలరేగాయి. సౌదీ.. ధనిక గల్ఫ్ దేశం. అలాంటిది పాక్ తోడైతే ఈ ప్రాంతంలో అది భౌగోళిక రాజకీయ సంక్షోభానికి దారితీయవచ్చని నిపుణుల అంచనా. గత ఏడాది దోహా, ఖతార్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో గల్ఫ్‌లో దేశాల భద్రతపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. అందుకే సౌదీ అరేబియా.. తమకు మద్దతుగా నిలిచే దేశాలపై దృష్టిపెట్టింది. దీనిలో భాగంగా పాకిస్తాన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. అందులోనూ అమెరికాపై నమ్మకం లేకపోవడంతో సౌదీ.. పాక్‌తో ఒప్పందం వైపు మళ్లిందనే ప్రచారం జరిగింది. ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం.. సౌదీకి, పాక్‌కు మధ్య ఒప్పందం ఉన్నప్పటికీ పాక్ యుద్ధానికి దిగే అవకాశం లేదు.

## సంపాదకీయం

# పెట్రో భయాలు!




ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దాడితో మన దేశానికి తీవ్రమైన ఇంధన సంక్షోభం తప్పదన్న భయాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటూ ఇరాన్ చేస్తున్న ప్రతీకార దాడులతో పశ్చిమ ఆసియా అంతా యుద్ధ మేఘాలు విస్తరిస్తున్నాయి. చర్చలు జరుగుతున్న వేళ అనూహ్యంగా అమెరికా ఇరాన్‌పై చేసిన దాడి ప్రస్తుతం గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జిసిసి) దేశాలంతటా వ్యాపించింది. పర్షియన్ గల్ఫ్ నుంచి బయటకు వెళ్లే ఏకైక సముద్ర మార్గమైన హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. జలసంధి నిండా వందలాది ట్యాంకర్లు నిలిచిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో బ్రెంట్ క్రూడ్ చమురు ధర యుద్ధానికి ముందు బ్యారెల్‌కు 65 అమెరికన్ డాలర్లుగా ఉండగా, మంగళవారానికి పది డాలర్లపైన పెరిగింది. ఇదే పరిస్థితులు కొనసాగితే రానున్న రోజుల్లో ధర మరింతగా పెరగడం ఖాయమన్న విశ్లేషణలు వస్తున్నాయి. ఇరాన్‌కు సమీపంలోని 33 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ జలసంధి ద్వారానే ప్రపంచ చమురు, సహజ వాయువు సరఫరాలో దాదాపు ఐదవ వంతు సాగుతుంది. మన దేశం రోజుకు సగటున నలభై లక్షల బ్యారెళ్ల చమురు దిగుమతి చేసుకుంటూ ఉండగా, అందులో 55 శాతం దీని ద్వారానే వస్తోంది. ప్రతి బ్యారెల్ చమురు ధరలో ఒక డాలర్ పెరుగుదల చోటుచేసుకున్నా, భారత్‌పై సంవత్సరానికి 200 కోట్ల రూపాయల (2 బిలియన్ డాలర్లు) అదనపు దిగుమతి భారం పడుతుందని అంచనా! అధికారిక సమాచారం ప్రకారం 2024-25లో చమురు దిగుమతుల కోసం మన దేశం సుమారుగా 11.5 లక్షల కోట్ల రూపాయల (137 బిలియన్ డాలర్లు)ను ఖర్చు చేసింది. ఏకపక్షంగా యుద్ధానికి కాలు దువ్విన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'ప్రస్తుతం నాలుగు నుండి ఐదు వారాలు' కొనసాగ వచ్చని చెబుతున్నారు. ఇరాన్ ప్రతిఘటన తీరును గమనిస్తున్న పరిశీలకులు యుద్ధం అంతకన్నా ఎక్కువ రోజులే సాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా పెరిగే దిగుమతి ఖర్చుల వల్ల విదేశీ లోటు పెరిగి వాణిజ్య సమతుల్య తను దెబ్బతీస్తుందని, రూపాయిపై ఒత్తిడి పెరుగుతుందన్న ఆందోళనలు వ్యక్త మవుతున్నాయి. బుధవారం నాడు రూపాయి విలువ గణనీయంగా పడిపోయింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి దేశీయ ట్రేడ్ సూచికలు పతనోన్ముఖానే వున్నాయి. మరోవైపు మన దేశం వద్ద ఉన్న చమురు నిల్వలు మరో 40-45 రోజుల వినియోగానికి మాత్రమే సరిపోతాయంటూ వస్తున్న వార్తలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మనకు పొరుగునే ఉన్న చైనా వద్ద దాదాపు ఆరునెలలకు సరిపడే నిల్వలు ఉండటం అక్కడి పాలకుల ముందుచూపునకు నిదర్శనం. ఈ పరిణామాల నేపథ్యంలో నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న ఒక నిర్ణయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అమెరికా ఒత్తిడికి లొంగి, తక్కువ ధరకు లభించే రష్యా చమురు దిగుమతులను భారీగా తగ్గించేందుకు అంగీకరించిన విషయం తెలిసిందే. దీంతో రష్యా నుండి రోజుకు సుమారు 20 లక్షల బ్యారెళ్ల మేరకు వచ్చే దిగుమతులు 10 లక్షల బ్యారెళ్లకు తగ్గాయి. అమెరికాకు ఇచ్చిన హామీ ప్రకారం రానున్న రోజుల్లో దీన్ని మరింతగా తగ్గించాల్సి ఉంది. ఈ నిర్ణయంపై అప్పట్లో ప్రజల నుండి విమర్శలు వెల్లువెత్తినా కేంద్రం పట్టించుకోలేదు. ఇప్పుడు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేసిన దాడి, హోర్ముజ్ జలసంధి మూసివేతతో మనదేశ ఇంధన భద్రత ప్రశ్నార్థకంగా మారింది. నలభై రోజులకు సరిపడే నిల్వలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ యుద్ధ తీవ్రత కొనసాగితే పెట్రోధరలు పెరగక తప్పవన్న ఆందోళన వినియోగదారుల్లో వ్యక్తమవుతోంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగితే దాని ప్రభావంతో నిత్యావసర వస్తువులతో పాటు, అన్ని రకాల వినియోగ సరుకుల మీద ఉంటుందన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అదే జరిగితే, దేశ వ్యాప్తంగా సామాన్యుల కష్టాలు మరింత పెరగుతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇంధన సంక్షోభాలను ఎదుర్కొనేందుకు చమురు సరఫరా వనరులను విస్తరించేందుకు కేంద్రం తక్షణం చర్యలు తీసుకోవాలి.

## నవ మాసాలు మోసిన తల్లి...
# నరరూప రాక్షసి గా మారింది...

-రోజురోజుకి మానవత్వం మంట కలిసి పోతుంది....
-అప్పుడే పుట్టిన పసికందును ముళ్లపొదల్లో పడేయడానికి ఆ తల్లికి మనసు ఎలా ఒప్పింది....
-ఆ తల్లికి హృదయం తల్లడిల్ల లేదా.... అసలు హృదయం ఉందా....
-10 నిమిషాల సుఖ సంతోషాల కోసం...
ఒక నిండు ప్రాణాన్ని బలిచ్చే అధికారం ఎవరిచ్చారు మీకు....

**మార్చి 04 తిరుపతి జిల్లా (నాయుడుపేట)మహా ప్రభ**
తిరుపతి జిల్లా, నాయుడుపేట, చంద్రబాబు నాయుడు కాలనీ లో మంగళవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో అప్పుడే పుట్టిన ఆడ శిశువును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ముళ్లపొదల్లో పడేసి వెళ్లిపోయారు. పసికందు ఆర్తనాదాలు విన్న కొందరు అక్కున చేర్చుకుని పాప ప్రాణం కాపాడారు.విషయం తెలుసుకున్న ఆశ వర్కర్స్ పాపను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు పసికందుకు అన్ని పరీక్షలు చేసి పాప సంపూర్ణ ఆరోగ్యంగా ఉందని తెలియజేశారు....



**పసికందు మౌన వేదన....**
నాకు జన్మనిచ్చిన వ్యక్తిని ఏమనాలో కూడా నాకు తెలియదు... అమ్మ అని పిలవాలి అంటే ప్రపంచంలో ఏ తల్లి తన బిడ్డను ముళ్లపొదల్లో పడవేయరు... మీ సుఖం కోసం నన్ను ఎందుకు బలి చేస్తున్నారు... నేను చేసిన పాపం ఏమిటి... తప్పు ఏమిటి... ఆడపిల్లగా పుట్టడం నా తప్పు... ఇప్పుడు నా పరిస్థితి ఏమిటి... నన్ను ఎవరు పెంచుతారు... జన్మలో నాకింకా నాతల్లి ప్రేమ దొరకదు కదా... రాత్రి ముళ్లపదల్లో పడవేశారు ... అప్పుడు వీధి కుక్కలు నా మీద దాడి చేస్తాయని నీకు గుర్తు రాలేదా అమ్మ.... చీమలు నామీద దండయాత్ర చేస్తాయని మరచిపోయావా.... నవ మాసాలు మోసి... కన్నీ... పడేయడానికి నీకు మనసు ఎలా ఒప్పింది.... జాలి.. దయ... కరుణ లేని నువ్వు నన్ను పెంచకపోవడమే మేలు.....

## రామక్కపేటలో
# రామయ్య విగ్రహ ప్రతిష్ట

-రామక్కపేటలో రమ్యా మనోహరంగా శ్రీ సీతారామచంద్ర లక్ష్మణ, ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం మార్చ్ 6 నాడు ప్రారంభం

**దుబ్బాక - మార్చి 4 ( మహాప్రభ**
రామక్కపేటలో రమ్యా మనోహరంగా శ్రీ సీతారామచంద్ర లక్ష్మణ, ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు, ఆలయ కమిటీ చైర్మన్ సుంకోజ్ మనోజ్ చారి పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల పరిధిలోని శ్రీ సీతారామచంద్ర, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం మార్చి 06 శుక్రవారం గణపతి పూజలు మొదలుకొని వివిధ దేవత పూజలు అవాహన అగ్ని ప్రతిష్ట, జాలాది వాసము, శిలా మూర్తులకు విశేష అభిషేకములు వివిధ పూజ హోమాలు, 07 శనివారం నాడు ఉపనిషత్తు పారాయణం, యాజుర్వేద విశ్వకర్మ సూక్త పారాయణం, స్థాపిత మంట పూజ హోమాలు, మంగళహారతి మంత్ర పుష్పం ఆశీర్వాచనములు తీర్ధ ప్రసాదములు, నిర్వహించనున్నారు, చివరి రోజు 08 ఆదివారం నాడు ఆదిత్య భగవానుని అనుగ్రహం కొరకు ప్రత్యేక క్రియలు అలాగే లక్ష్మి స్వరూపిణి సాధ్వి మత సీతాదేవి ఆశీర్వాదం కొరకు సామూహిక కుంకుమార్చన స్వస్తిశ్రీ నిత్యావాసు మామ సంవత్సర పాల్గొన్న బహుళ పంచమి స్వాతి నక్షత్ర యుక్త భూషభ లగ్న పుష్కరాంశ సుముహూర్తమున ఉదయం 11 నిమిషాలకు శ్రీ సీతారామచంద్ర భగవానుని యంత్ర శీల విగ్రహ ప్రతిష్ట





కార్యక్రమం నిర్వహించ బడును, ఈ సందర్భంగా శ్రీ సీత రామచంద్ర స్వామి ఆలయ కమిటీ చైర్మన్, మెంబర్లు మాట్లాడుతూ.... ఈ రామాలయ నిర్మాణం గత 13 సంవత్సరాల క్రితం మొదలు పెట్టడం జరిగిందని ఈ నిర్మాణం కు గ్రామ అన్ని కులాల పెద్దల ఐకమత్యంతో నిర్మాణానికి స్థల దాతల సహకారం, అలాగే దాతల సహకారంతో రామాలయ నిర్మాణం కొనసాగుతుందని అన్నారు. ఈ విగ్రహ ప్రతిష్టకు ఈ ఆలయ నిర్మాణానికి విరాళాలు అందించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతున్నామన్నారు. ఎంతో అవసరం ఉందని దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి అండగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ సభ్యులు గ్రామ సర్పంచ్ కొండ విటోబా డాక్టర్, మాజీ సర్పంచ్ రాజు కట్ల మైసరాజు, పాలకవర్గం వార్డు మెంబర్ పోన్నాల యాదగిరి, సంధ్యపు బాలయ్య, గౌడుగు వెంకటేశ్వర్, పెంబర్తి భాస్కర్, ముదిగొండ భగవాన్, రామకృష్ణప్రభు, అలుమాల రాజాశీ, గ్రామ అన్ని కులాల పెద్దలు వివిధ యువజన సంఘాల సభ్యులు,రామ భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు 111 కోట్లు రూపాయలు చెల్లింపులు

-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

**మెదక్ జిల్లా -04 మార్చి (మహాప్రభ )**
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు జిల్లా వ్యాప్తంగా 5201 ఇందిరమ్మ ఇండ్లకు గాను 111 కోట్లు చెల్లించినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు. బుధవారం కౌడిపల్లి మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన పనులు ప్రారంభించి, నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ప్రతివారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల బిల్లులను చెల్లిస్తున్నట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ ఎంపీడీవో హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల బిల్లుల చెల్లింపుల జాప్యం చేయొద్దు

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

**మెదక్ జిల్లా-04మార్చి (మహాప్రభ)**
జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల బిల్లు చెల్లింపుల్లో జాప్యం చేయొద్దు అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సురక్షితమైన, శాశ్వత నివాస గృహాలు అందించడం లక్ష్యమని తెలిపారు.నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టంగా ఆదేశించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, వారికి ఎలాంటి సమస్యలు ఉన్నాయో తెలుసుకున్నారు. నిర్మాణ సామగ్రి సరఫరా, బిల్లుల చెల్లింపులు, సాంకేతిక సిబ్బంది పర్యవేక్షణ వంటి అంశాలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి మెపా భరోసా..

**-తాళ్ళ రవీందర్ ముదిరాజ్ కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర నేతలు**



**వరంగల్, – మార్చి 4 ( మహాప్రభ )**
వరంగల్ జిల్లా మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) అధ్యక్షులు తాళ్ళ రవీందర్ ముదిరాజ్ తల్లి సుగుణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు మరియు వివిధ జిల్లాల కమిటీ బాధ్యులతో కలిసి రవీందర్ ముదిరాజ్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి మేమున్నామనే భరోసా కల్పించాలనే ఉద్దేశంతో వరంగల్ జిల్లాలోని దుగ్గొండి మండలం చంద్రయ్యపెల్లి గ్రామానికి వెళ్లి తాళ్ళ రవీందర్ ముదిరాజ్ కుటుంబ సభ్యులను పరామర్శించి కడుపుసల్ల చేశారు.
ఈ సందర్భంగా మెపా రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ తల్లి లేకపోయినా తల్లిలా చూసుకునే మెపా ఎల్లప్పుడూ రవీందర్ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్ మాట్లాడుతూ విద్యావంతులతో ఏర్పడిన మెపా ముదిరాజ్ జాతిలోని ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తుందని తెలిపారు. రవీందర్ ధైర్యంగా నిలబడి ముందుకు సాగాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు కట్ల విజయ్, పంతంగి భాస్కర్, ఉబ్బని రాజు, పాండవుల రామకృష్ణ, దండు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# శేరిపల్లి గ్రామంలో అంగన్వాడికి తాళం

**- ఇక్కడికి ఎవరు రారు మమ్మల్ని పట్టించుకోరు అనుకుంటున్నారు**
**-టీచర్ ఇష్టాను రాజ్యాంగ నడుస్తున్న అంగన్వాడి**
**-ఇప్పటికైనా అధికారులు స్పందించాలి**

**టేక్మాల్ ప్రతినిధి – మార్చి 4 ( మహాప్రభ )**
కోట్లాది రూపాయల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం తల్లులు, పిల్లల సమాగ్రాభివృద్ధి కోసం నిర్దేశించిన సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం (ఐ.సి.డి.యస్) ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రాలను నడుపుతోంది. చిన్న పిల్లలకు చదువుపై మక్కువ పెంచేందుకు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు గాను మెనో ప్రకారం పాలు, గుడ్డు, బాలమృతంతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలని ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలల్లో పని చేస్తున్న సిబ్బందికి ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు అంగన్వాడి కేంద్రాలను నడిపించాలన్ని అధికారులు ఆదేశాలు అందజేశారు. కానీ అంగన్వాడీ కేంద్రంలో అధికారులు ఆశించిన విదంగా సమయానికి పౌష్టికాహారం విద్యాబోధన అందకపోవడంతో కిశోర బాల బాలికలు, ఇబ్బందులు పడుతున్నారని మధ్యాహ్నం వరకే అంగన్వాడి కేంద్రం మూతపడి ఉండడం అధికారుల పర్యవేక్షణ లోపంమే ప్రధాన కారణమని దానివల్ల ఆ పిల్లలకు శాపంగా మారిందని స్థానికులు అంటున్నారు. టేక్మాల్ మండలంలోని దన్నారం సెక్టార్ పరిధిలో శేరిపల్లి గ్రామంలో గల అంగన్వాడి సెంటర్ (1) లో అంగన్వాడీ టీచర్ సమయపాలన పాటించడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు టీచర్ ఉండి చిన్నపిల్లల చదువుపై మక్కువ పెంచేందుకు సమయానికి పౌష్టికాహారం విద్యాబోధన అందకపోవడంతో కిశోర బాల బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్వాడి



కేంద్రం ఉదయం నుండి తాళం వేసి ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి ఇలాగైతే అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు చదువులు ఎలా కొనసాగుతాయని స్థానిక ప్రజలు ప్రశ్నించుకుంటున్నారు ఈ విషయంపై బుధవారం రోజున ప్రజావాణి న్యూస్ రిపోర్టర్ మధ్యాహ్నం 1:20 ప్రాంతంలో అంగన్వాడి సెంటర్ కు వద్దకు వెళ్లి చూస్తే సెంటర్ కు తాళం వేసి ఉంది. స్థానికులను అడగగా అంగన్వాడి కేంద్రాన్ని ఎప్పుడు తెరుస్తారో ఎప్పుడు మూస్తారో తెలియకుండా ఉందని గర్భిణీలు బాలింతలు వాపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో మూసివేసిన అంగన్వాడి కేంద్రంలో గర్భిణీలకు బాలింతలకు చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ దీనివల్ల అధికారుల పర్యవేక్షణ లోపంతో ఆ పిల్లలకు శాపంగా మారిందని మారుమూల ప్రాంతాలలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువై ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని స్థానికులు అంటున్నారు.

# అనూష మృతి పై విచారణ జరపాలి

**ప్రజా సంఘాల డిమాండ్**

**రంగారెడ్డి జిల్లా – మార్చి 4 ( మహాప్రభ )**
గిరిజన బాలిక అనూష మృతి పై విచారణ జరపాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్ జిల్లా బాలల సంక్షేమ సమితి, జిల్లా బాలల పరిరక్షణ అధికారికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ భూ యజమాని అంతమొల్ల దయాకర్ రెడ్డి బలవంతంగా 14 సంవత్సరాలు నిండని అనూషతో పనిచేయించుకోవడం వల్లనే ఆమె మృతి చెందిందని అన్నారు. స్వయానా రాజకీయ నాయకుడైన ఆయన బాధితుల ఆర్థిక, సామాజిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని వారికి అతి తక్కువ వేతనం చెల్లిస్తూ పని చేయించుకున్నారని తెలిపారు. పనికి వెళుతున్న క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడి గిరిజన బాలిక అనూష మృతి చెందడానికి దయాకర్ రెడ్డి పూర్తి



బాధ్యుడని పేర్కొన్నారు. పోలీసులు మాత్రం దీనిని సాధారణ యాక్సిడెంట్ కేసుగా నమోదు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఆమెను బాల కార్మికురాలిగా నిర్ధారించడంలో పోలీసులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని విమర్శించారు. రాజకీయ అండదండలు ఉండడంతోనే దయాకర్ రెడ్డి పై బాలల హక్కుల చట్టం ప్రకారం కేసు నమోదు చేయడానికి పోలీసులు వెనుకాడుతున్నారని అన్నారు. అధికారులు ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టి ఆమెను బాల కార్మికురాలిగా గుర్తిస్తూ బాధ్యుడైన దయాకర్ రెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై త్వరలోనే నవాబ్ పేట్ మండల కేంద్రంలో దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి పోరాటానికి కార్యాచరణ సిద్ధం చేయనున్నట్లు సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల మల్లేశం, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.గీత, బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ బి.శివరాజ్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గుట్టకింది రవికుమార్, విహెచ్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, పిడిఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు బి.శ్రీకాంత్, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఉమ, జామ దశరథ్, శ్రీనివాస్, బి.నరేందర్, ఎ.మల్లేష్, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రామాయంపేట మున్సిపల్ కమిషనర్ గా బి శ్రావణ్ బాధ్యతల స్వీకరణ

**రామాయంపేట – మార్చి 4 ( మహాప్రభ )**
మెదక్ జిల్లాలో రామాయంపేట మున్సిపల్ కమిషనర్ గా బి శ్రావణ్ బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. గ్రూప్ వన్ అధికారిగా ఎంపికైన ఆయన తొలిసారిగా ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ... ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని వారు తెలిపారు. ప్రజలు, చైర్మన్, కౌన్సిల్ సహకారాలతో మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

# వడ్డెర కులస్తుల కార్పొరేషన్ కు రూ. 1000 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి:

**-డివిజన్ అధ్యక్షుడు ఇరగదిండ్ల కృష్ణ,**



**దేవరకొండ, మార్చి 4 ( మహాప్రభ )**
వడ్డెర కులస్తుల ఆత్మగౌరవం మరియు హక్కుల సాధన కోసం తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివరాత్రి ఆయన మల్లు గారి పిలుపు మేరకు ఈనెల 8 వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేయాలని వడ్డెర సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఇరగదిండ్ల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉద్యమం కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని దశాబ్దాలుగా వడ్డెర జాతి ఎదుర్కొంటున్న నిర్లక్ష్యానికి, అన్యాయానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న చైతన్య ప్రతిఘటనని తెలిపారు, గత 27 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న వడ్డెర కార్పొరేషన్ అంశాన్ని ప్రజా యజెండగా మార్చి దానిని సాధించుకోవడమే ఈ ఉద్యమం ప్రధాన కర్తవ్యం, వడ్డెర కులస్తుల కార్పొరేషన్ కు రూ.1000 కోట్లు కేటాయించాలని ఇది తమ హక్కు అని ఆయన స్పష్టం చేశారు, వడ్డెర ఆర్థిక అభివృద్ధి, విద్యా ఉపాధి హక్కులను సాధించేందుకు ఈ కార్పొరేషన్ బలమైన సాధనంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు, రాజకీయ వేదికల ద్వారా మన గళం వినిపించాలని గుర్తు చేశారు, దేవరకొండ డివిజన్లోని వడ్డెర కులస్తులు, బంధువులు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు

# విద్యుత్తు కార్మికుల ధర్నా..!



**దేవరకొండ మార్చి 4 ( మహాప్రభ**
దేవరకొండలో విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డివిజన్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు, జీవో నెంబర్ 11 ను తక్షణమే అమలు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డివిజన్ అధ్యక్షులు తిరుపతయ్య డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, జైపాల్, మనీష్, సాయి వికాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# శనివారం నాడు అహ్మది పూర్ లో కోటి తలంబ్రాల దీక్ష

**-భద్రాచల రామయ్య తలంబ్రాలలో పాల్గొనండి**
**-భక్తి రత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు**



**దుబ్బాక – మార్చ్ 04 (మహాప్రభ )**
భద్రాచల సీతారాముల కళ్యాణం లో గోటి తలంబ్రాలు వాడుతారు. ఈ తలంబ్రాలు దీక్ష కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అహ్మదిపూర్ గ్రామంలో శనివారం కోటి తలంబ్రాలు దీక్ష కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తి రత్న జాతీయ అవార్డు గ్రహీత, శ్రీ రామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం రామాలయంలో సమావేశం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇతర గ్రామాల భక్తులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్న వచ్చానారు. గోటి తలంబ్రాల కార్యక్రమంలో స్త్రీ, పురుష, లింగ బేధం లేకుండా అందరూ పాల్గొనాలన్నారు. మనం లేకున్నా మనం కొలిచే తలంబ్రాలు కళ్యాణం లో ఉంటే బహు పుణ్యం, అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సింగిరెడ్డి గోపాల్ రెడ్డి, గజ్వేల్ రామచంద్రారెడ్డి, ఆకుల నరేష్ కుమార్, గజ్వేల్ నరేందర్ రెడ్డి, చాడ కర్ణాకర్ రెడ్డి, రాములు గౌడ్, ఆకుల ప్రభాకర్, గురుమూర్తి బోయిని సత్యం, బాలరాజు గౌడ్, కిరణ్ కుమార్,గౌడ్ మల్లేశం, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

## అమ్రాబాద్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన హనుమంత్ రెడ్డి



**అమ్రాబాద్, మార్చి 4 ( మహాప్రభ**

అమ్రాబాద్ మండల కేంద్రానికి కొత్తగా వచ్చిన ఎస్ఐ హనుమంత్ రెడ్డిని స్థానిక ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి, స్వీట్లు తినిపించి ఆత్మీయతను వ్యక్తం చేశారు. ఎస్ఐ హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ, మండలంలో శాంతి భద్రతలను ఎల్లప్పుడూ కాపాడేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సహకారం తనకు ఎంతో అవసరమని, అందరి సహకారంతో సమగ్ర శాంతి భద్రతా వాతావరణాన్ని కొనసాగిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో అమ్రాబాద్ సర్పంచ్ చిగుర్లకోటయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నోముల బాలలింగం గౌడ్, అబ్బు మక్బూల్, గోలి మల్లేష్, నిరంజన్, కార్యకర్తలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన అక్కన్నపేట సర్పంచ్



**హుస్నాబాద్, మార్చి 4 ( మహాప్రభ**

అక్కన్నపేట మండలంలోని రామవరం గ్రామంలో 10వ వార్డులో నెలకొన్న నీటి సమస్యను సర్పంచ్ బోమ్మ శ్రీశైలం పరిష్కరించారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గమనించిన వార్డు మెంబర్ ఎడబోయిన స్రవంతి, ప్రకాష్ రెడ్డితో కలిసి సింగిల్ ఫేస్ బోర్ మోటర్ ఫిట్టింగ్ చేయించి సమస్యను తీర్చారు. సకాలంలో స్పందించి సమస్యను పరిష్కరించడంతో 10వ వార్డు ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ లింగాల కనకయ్య, గ్రామ కార్యదర్శి రామ్, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా లైన్‌మెన్ దివాస్ వేడుకలు





**పాలకుర్తి, మార్చి 4 ( మహాప్రభ**

దేశానికి రక్షకుడు సైనికుడైతే, రైతుకు రక్షకుడు విద్యుత్ శాఖలో నిరంతరం ప్రాణాలతో పోరాడే లైన్‌మెన్ అని రామగుండం ఏడిఈ ఎర్రోజు రమేష్ ప్రశంసించారు. పాలకుర్తి మండలం బసంత్‌నగర్ జీఎం ఫంక్షన్ హాల్లో బుధవారం లైన్‌మెన్ దివాస్ సందర్భంగా లైన్ ఇన్స్పెక్టర్లు, లైన్‌మెన్లు, ఆర్టిజన్లు, స్పాట్ బిల్లర్లను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిబ్బందితో లైన్‌మెన్ దివాస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏడిఈ రమేష్ మాట్లాడుతూ, ఎండనక వాననక 24 గంటలు ప్రాణాలకు తెగించి వినియోగదారులకు వెలుగులు పంచే నిజమైన హీరోలు లైన్‌మెన్లు. పనిలో రక్షణ పరికరాలను ధరించి, భద్రతా నియమాలు పాటిస్తూ కుటుంబాలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి అని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించారు. ఎస్ఎస్-3 అగ్రికల్చర్ 63 కేవీ ట్రాన్స్ఫార్మర్ స్థానంలో 100 కేవీ కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడంతో సమస్య తీరింది. దీంతో రైతులు విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ మానాల ప్రసాద్, సబ్ ఇంజనీర్ సాపిడి రాజ్‌కుమార్, లైన్ ఇన్స్పెక్టర్ కాసుల కిరణ్, లైన్‌మెన్ మోతీలాల్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సహజ రంగులతో హోలీ సంబరాలు



**కరీంనగర్, మార్చి 4 ( మహాప్రభ**

కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హోలీ పండుగను పర్యావరణ హిత దృక్పథంతో సహజ రంగులతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో రసాయనిక రంగులను పూర్తిగా నివారించి, బిక్సా పువ్వు, పసుపు, మోదుగ, మందారం, తంగేడు, గన్నేరు, బంతి, రోజా, అపరాజిత, బీట్రూట్, క్యారెట్, శెవంతి వంటి పూలు మరియు సహజ వనరులతో రంగులను విద్యార్థులు స్వయంగా తయారు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. మనోజ్ కుమార్, డాక్టర్ విద్య, డాక్టర్ ఆర్. దేవేందర్, రేఖారాణి, ప్రియాంక, రావళి, అనిత, నారాయణ, మౌనిక తదితర అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ప్రిన్సిపాల్ వరలక్ష్మి మాట్లాడుతూ, సహజ రంగులతో హోలీ జరుపుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. విద్యార్థులు ప్రకృతిని ప్రేమించే అలవాటు పెంపొందించుకోవాలి" అని సూచించారు. డాక్టర్ మనోజ్ కుమార్ సహజ వనరుల ప్రాముఖ్యతను వివరించి, రసాయన రహిత హోలీ జరుపుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సహజ రంగులతో హోలీ సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య జాగ్రత్తలు, సంప్రదాయ విలువలపై అవగాహన కల్పించబడింది.

## సమస్యల పరిష్కారానికి కృషి



**ఆమనగల్లు,మార్చి 4 ( మహాప్రభ**

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ ప్రత్యనాయక్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మున్సిపాలిటీలోని 13వ వార్డులో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. మ్యాన్ హోల్ పరిస్థితిని స్వయంగా పరిశీలించి శుభ్రత పనులపై అధికారులకు తగు సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికులు కూడా సమస్యలు వివరించారు. కాలనీవాసులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి శ్రీశైలం,రమేష్, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కులు అందజేసిన కేటీఆర్



**ఉప్పల్, మార్చి 4 ( మహాప్రభ**

ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన 16 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యా ఫీజుల చెక్కులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు బుధవారం తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "వైద్య విద్యార్థులకు సహాయం చేయడం అభినందనీయం. మీరు రేపటి వైద్యులు గనుక, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదర్శంగా తీసుకొని పేదలకు ఉచిత వైద్యం అందించాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఏఎంసీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి

**హాలియా మార్చి 4 ( మహాప్రభ**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రివర్యులు కుందూరు జానారెడ్డి ఆశీస్సులతో, ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి పి.ఏ ప్రవీణ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా హాలియా ఎఎంసి చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి శాలువా తో సత్కరించి పూల గుచ్ఛాన్ని అందించి పుట్టినరోజు శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని అన్నారు.

## ఫెర్టిలైజర్ యూరియా యాప్ రైతులకు తికమక

**పాలకుర్తి, మార్చి 4 ( మహాప్రభ**






యాసంగి సీజన్‌లో రైతులకు యూరియా సరఫరా కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ యూరియా యాప్ రైతులకు తలనొప్పిగా మారింది. పాలకుర్తి మండలంలోని ఈశాల తక్కల్లపల్లి, రామారావుపల్లి, కొత్తపల్లి, పాలకుర్తి గ్రామాల రైతులు ఈ యాప్ వినియోగంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిరక్షరాస్య రైతులకు ఆన్లైన్ బుకింగ్ కష్టతరంగా మారగా, స్మార్ట్‌ఫోన్ లేని రైతులు యాప్, ఓటీపీ వంటి పదాలు అర్థం చేసుకోలేక తికమక పడుతున్నారు. యాప్ ద్వారా బుక్ చేసిన కొద్దిసేపటికే స్టాక్ అయిపోతుందని రైతులు వాపోతున్నారు. యూరియా అవసరమున్న రోజే బుక్ చేసుకోవాలని, ముందుగా నిల్వ పెట్టుకోరాదని అధికారులు హెచ్చరించడం రైతులకు మరింత ఇబ్బందిగా మారింది. రైతులు యాప్ ద్వారా కాకుండా నేరుగా సొసైటీల ద్వారానే యూరియా అందించాలని కోరుతున్నారు. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి యాప్ వినియోగంపై రైతులకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

## నిరుపేద కుటుంబం నుంచి జాతీయ స్థాయి క్రికెటర్ వరకు

-పోలీస్ విధుల్లోనూ, క్రీడా రంగంలోనూ మెరుస్తున్న సాయి

-జిల్లా ఎస్పీ చేతుల మీదుగా సన్మానం

-- నగదు ప్రోత్సాహకం అందజేత.




**మెదక్ జిల్లా -04ఫిబ్రవరి (మహాప్రభ )**

జాతీయ స్థాయి క్రికెట్ క్రీడాకారుడైన కానిస్టేబుల్ సాయి కుమార్‌ను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. క్రీడా రంగంలో ఆయన సాధించిన విజయాలను గుర్తించి అభినందించారు. తిరుపతిలో ఇటీవల నిర్వహించిన సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్‌లో సాయి అద్భుత ప్రదర్శనతో జట్టును సెమీ ఫైనల్ వరకు చేర్చడంలో కీలక పాత్ర పోషించారు. అలాగే ఎలైట్ క్రికెట్ ప్రీమియర్ లీగ్‌లో తెలంగాణ పోలీస్ క్రికెట్ జట్టు విజేతగా నిలవడంలోనూ ఆయన ప్రధాన పాత్ర పోషించారు. ఈ విజయాలతో జిల్లా పోలీస్ శాఖకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకువచ్చారని ఎస్పీ ప్రశంసించారు. విధి నిర్వహణతో పాటు క్రీడా రంగంలోనూ రాణిస్తూ యువ పోలీస్ సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తున్న సాయి, నిరుపేద విద్యార్థులకు ఉద్యోగ మార్గదర్శకత్వం అందిస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శైలేందర్, ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, సీసీ రాజేందర్ పాల్గొన్నారు

# బిజినెస్

## కుప్పకూలిన రూపాయి..

**డాలర్‌తో పోల్చితే రికార్డు స్థాయిలో పతనం**




**ఇంటర్నెట్ డెస్క్:** ఇరాన్ సంక్షోభం నేపథ్యంలో రూపాయి విలువ భారీగా పతనమైంది. ముడి చమురు ధరలు పెరగడంతో బుధవారం అమెరికా డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 67 పైసలు క్షీణించి ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి 92.16కు చేరింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో భారీ అమ్మకాలు, విదేశీ ఇన్వెస్టర్లు నిధులను ఉపసంహరించుకోవడమే భారత కరెన్సీ పతనానికి కారణమని మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. రూపాయి విలువ పతనం వల్ల విదేశీ నిధులు తరలిపోయి కంపెనీల లాభాలపై తీవ్ర ప్రభావం పడుతుంది.పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో బంగారం, వెండితో పాటు డాలర్ ప్రాబల్యంతో స్టాక్ మార్కెట్లు కూడా భారీ స్థాయిలో పతనమయ్యాయి. మూడు రోజులుగా వరుస నష్టాలతో డీలాపడిన భారతీయ స్టాక్ మార్కెట్లు.. నాలుగో రోజూ తీవ్ర నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయంగా ముదురుతున్న యుద్ధ మేఘాలు దేశీయ స్టాక్ మార్కెట్లను కుదిపేస్తున్నాయి. ఇవాళ ట్రేడింగ్‌లో దలాల్ స్ట్రీట్ చరిత్రలో నిలిచిపోయే భారీ పతనాన్ని చవిచూసింది. ఓ దశలో 1,700 పాయింట్ల మేర క్షీణించిన సెన్సెక్స్.. చివరకు కాస్త కోలుకుని 1122 పాయింట్ల నష్టంతో గట్టెక్కింది. ఉదయం 78525 పాయింట్ల వద్ద ప్రారంభమైన సెన్సెక్స్(క్రితం రోజు ముగింపు 80,238) ఇంట్రాడేలో 78,443 కనిష్ఠ స్థాయికి చేరింది. చివరకు 79,116 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా ఓ దశలో 500 పాయింట్ల పతనాన్ని చవిచూసి.. చివరకు 385 పాయింట్ల నష్టంతో 24,480 వద్ద ముగిసింది. దీంతో ఇన్వెస్టర్ల లక్షల కోట్ల సంపద ఆవిరైంది. కొద్ది రోజుల కిందటే 91 రూపాయల మార్క్‌ను దాటిన రూపాయి విలువ.. అనతి కాలంలోనే 92ను కూడా దాటడం ఆందోళనకర అంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే అంతర్జాతీయ లావాదేవీలన్నీ డాలర్ మీదే ఆధారపడి ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో రూపాయి విలువ 90ని దాటడంతో దేశ ఆర్థిక వ్యవస్థను మరింత ఒత్తిడిలోకి నెట్టే అవకాశముంది. గతంలో ఎప్పుడూ ఇంత భారీ స్థాయిలో రూపాయి విలువ పతనమవ్వలేదు. ఈ యుద్ధం మరికొన్ని రోజులపాటు ఇలాగే కొనసాగితే మార్కెట్లు మరింత కుంగిపోయే ప్రమాదం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి అడుగు వేయాలని హెచ్చరిస్తున్నారు.

## భారీగా తగ్గిన బంగారం ధర..



గోల్డ్ ప్రియులకు గుడ్ న్యూస్. పశ్చిమాసియా దేశాల్లో వార్ పసిడి ప్రియులకు కలిసి వస్తోంది. ధరలు భారీగా తగ్గుముఖం పడుతున్నాయి. ఇరాన్ పై అమెరికా ఇజ్రాయెల్ తో కలిసి చేసిన దాడితో డాలర్ పుంజుకుంది. ట్రంప్ వార్నింగ్ కూడా తోడవడంతో మార్కెట్లో డాలర్ ఆధారిత ఆస్తుల వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపారు. దీంతో పసిడి ధరలు తగ్గుముఖం పట్టాయి. గత మూడు రోజుల నుంచి బంగారం ధరలు తగ్గుతూ వస్తున్నాయి. మార్చి 4 బుధవారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.3,110 తగ్గి, రూ.1,64,510 పలుకుతోంది. 22 క్యారెట్ల బంగారంపై రూ.2,850 తగ్గి, రూ.1,50,800 పలుకుతోంది. కేజీ వెండి ధర రూ.2,85,000 లు పలుకుతోంది. మార్చి 4, బుధవారం వివిధ నగరాల్లో బంగారం, వెండి ధరలను పరిశీలిస్తే.. దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,64,660 వద్ద ట్రేడవుతోంది. అలాగే 22 క్యార్లట్ల బంగారం ధర రూ.1,50,950 పలుకుతోంది. ముంబై, కోల్‌కతాలో 24 క్యారెట్ల బంగారం రూ.1,64,510 ఉంటే, 22 క్యారెట్ల బంగారం రూ.1,50,800 పలుకుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,65,820 ఉంటే, 22 క్యారెట్ల బంగారం ధర రూ. రూ.1,52,000 గా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,64,510 ఉంటే, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,50,800 లు పలుకుతోంది. వెండి ధర కిలోకి రూ.2,85,000 గా కొనసాగుతోంది. ఈ ధరలు పెరగవచ్చు, తగ్గవచ్చు.. బంగారం కొనడానికి వెళ్లేముందు ధరలు మరోసారి చెక్‌చేసుకొని వెళ్తే మంచిది.

## స్టాక్‌మార్కెట్ క్రాష్.. సెన్సెక్స్ 1700 పాయింట్లు డౌన్..




పశ్చిమాసియాలోని ఉద్రిక్తతలు అంతర్జాతీయ మార్కెట్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఇరాన్‌తో అమెరికా, ఇజ్రాయెల్ ఘర్షణ నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు భారీగా పెరిగాయి. ఈ ప్రభావం మనదేశంపై తీవ్రంగా ఉంటుందనే అంచనాలు మదుపర్లను కలవరపెడుతున్నాయి. మరోవైపు డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి విలువ మరింత పతనమైంది. అంతర్జాతీయ మార్కెట్లు కూడా భారీ నష్టాల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాల్లో కదలాడుతున్నాయి గత సెషన్ ముగింపు (80,238)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం 1700 పాయింట్లకు పైగా నష్టంతో మొదలైన సెన్సెక్స్ మదుపర్లకు షాకిచ్చింది. చాలా రోజుల తర్వాత సెన్సెక్స్ 78,500 పాయింట్ల దిగువకు పడిపోయింది. ప్రస్తుతం ఉదయం 9:30 గంటల సమయంలో సెన్సెక్స్ 1726 పాయింట్ల నష్టంతో 78,511 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా భారీగా నష్టపోయింది. రెండు శాతానికి పైగా పడిపోయింది. ప్రస్తుతం 534 పాయింట్ల నష్టంతో 24,331 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో సోలార్ ఇండస్ట్రీస్, కోల్ ఇండియా, ఇన్ఫోసిస్, నాల్కో, పీబీ ఫిన్‌టెక్ మొదలైన షేర్లు స్వల్ప లాభాల్లో ఉన్నాయి (ఒష్ట్రుతీవ ఝితీనెవ్ అవషం). పెట్రొనాట్ ఎల్ఎన్‌జీ, లార్సన్, సెయిల్, టాటా స్టీల్, మదర్సన్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1260పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 1155 పాయింట్ల నష్టంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 92.16గా ఉంది.

# స్పోర్ట్స్

## చరిత్రాత్మక విజయంతో ఫైనల్లో న్యూజిలాండ్..

**అలెన్ బౌండరీల సునామీలో కొట్టుకుపోయిన దక్షిణాఫ్రికా..**




లీగ్ ఆసాంతం అదరగొట్టి.. ఆఖర్లో తడబడిన దక్షణాఫ్రికా భారీ మూల్యం చెల్లించుకుంది. సూపర్ 8లో భారత్, వెస్టిండీస్, జింబాబ్వేపై భారీ తేడాతో గెలిచిన.. సఫారీలను న్యూజిలాండ్ చిత్తు చిత్తుగా ఓడించింది. ఓపెనర్ ఫిన్ అలెన్(100 నాటౌట్) బౌండరీల సునామీలో ప్రొటీస్ జట్టు కొట్టుకుపోయింది. 170 పరుగుల లక్ష్య ఛేదనలో అలెన్ చిరస్మరణీయ సెంచరీతో చెలరేగగా.. పొట్టి ప్రపంచకప్‌లో తొలిసారి దక్షిణాఫ్రికాపై విజయంతో చరిత్ర లిఖించింది కివీస్. విన్నింగ్ షాట్‌తో అలెన్ శతకం పూర్తి చేసుకోగా 9 వికెట్ల విజయంతో దర్జాగా రెండోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది బ్లాక్‌క్యాప్స్. టీ 20 ప్రపంచకప్‌ను ముద్దాడాలనుకున్న దక్షిణాఫ్రికా కల చెదిరింది. లీగ్ దశ నుంచి అజేయంగా సెమీస్‌లో అడుగుపెట్టిన సఫారీ జట్టును అనామక జట్టులా ఓడించింది న్యూజిలాండ్. పొట్టి కప్‌లో గతంలో ఐదుకు ఐదుసార్లు ఓడిన కివీస్.. సంచలన ఆటతో ప్రొటీస్ జట్టుకు నాకౌట్ పంచ్ ఇచ్చింది. ఈడెన్ గార్డెన్స్‌లో సంజూ శాంసన్ అజేయ అర్ధశతకం(97 నాటౌట్)తో భారత్‌ను గెలిపించిన చోట.. ఫిన్ అలెన్(100 నాటౌట్) విధ్వంసక సెంచరీతో బ్లాక్ క్యాప్స్‌ను ఫైనల్‌కు తీసుకెళ్లాడు. సూపర్ 8లో ఇంగ్లండ్ చేతిలో ఓడిన కివీస్.. అనూహ్యంగా పుంజుకొని టైటిల్ పోరుకు దూసుకెళ్లడం విశేషం.

**పవర్ ప్లేలో కరిగిన లక్ష్యం**

ఈడెన్ గార్డెన్స్‌లో భారీ ఛేదనలో న్యూజిలాండ్‌కు ఓపెనర్లు ఫిన్ అలెన్(100 నాటౌట్), టిమ్ సీఫర్ట్(41 నాటౌట్)లు బెరుకు లేకుండా ఆడారు. తొలి ఓవర్లోనే సీఫర్ట్ రెండు ఫోర్లతో తన ఉద్దేశాన్ని చాటాడు. కానీ.. రబడ బౌలింగ్‌లో బంతిని గాల్లోకి లేపిన అతడికి క్వింటన్ డికాక్ లైఫ్ ఇచ్చాడు. బ్రెవిస్‌ను కాదని క్యాచ్ అందుకునేందుకు పరుగెత్తిన డికాక్.. చివరకు అడుగు దూరంలో ఆగిపోయాడు. అంతే.. అక్కడి నుంచి ప్రత్యర్థి బౌలర్లకు.. ఫీల్డర్లకు ఏ మాత్రం అవకాశమివ్వలేదీ జోడీ. మూడో ఓవర్ నుంచి కివీస్ ఓపెనర్ల విధ్వంసం తారా స్థాయికి చేరింది.యాన్సెన్‌కు గుబులు పుట్టిస్తూ ఇద్దరూ .. మూడో మూడో 18 రన్స్ పిండుకున్నారు. కార్బిన్ బాష్ వేసిన పవర్ ప్లే చివరి ఓవర్లో అలెన్ బౌండరీల మోతమోగించాడు. తొలి బంతినే సిక్సర్‌గా మలిచిన అలెన్.. ఆ తర్వాతి నాలుగు బంతుల్ని బౌండరీలకు తరలించి స్కోర్ 80 దాటించాడు. అంతే.. చూస్తుండగానే సగానికి పైగా లక్ష్యం కరిగిపోయింది. అర్ధ శతకాలతో తొలి వికెట్‌కు 117 పరుగులు రాబట్టిన ఈ ద్వయాన్ని విడదీసిన రబడ సఫారీలను ఊపిరి తీసుకోనిచ్చాడు. కానీ, రచిన్ రవీంద్ర() జతగా అలెన్ అదే దూకుడు కొనసాగించాడ. యాన్సెన్‌ను టార్గెట్ చేసిన అతడు.. 13వ ఓవర్లో 4, 4, 6, 6, 4తో జోరుతో మ్యాచ్‌ను ముగించాడు.

**యాన్సెన్ సిక్సర్ల హోరు..**

అజేయంగా సెమీస్‌కు దూసుకొచ్చిన దక్షిణాఫ్రికా సెమీఫైనల్లో తడబడినా.. మార్కో యాన్సెన్(55 నాటౌట్) మెరుపులతో భారీ స్కోర్ చేసింది. కొలే మెక్‌కొన్చీ(2-9) విజృంభణతో టాపార్డర్.. మిడిలార్డర్ కుప్పకూలిన చోట.. ఈ బక్కపలచని ఆల్‌రౌండర్ దంచేశాడు. డెవాల్డ్ బ్రెవిస్(34) ఔటయ్యాక ట్రిస్టన్ స్టబ్స్(29) జతగా అటాకింగ్ గేమ్‌తో న్యూజిలాండ్ బౌలర్ల లయను దెబ్బతీసి హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పాడు. సఫారీలను పోటీలోకి తీసుకొచ్చిన యాన్సెన్.. ఆఖరి ఓవర్లో మరింత చెలరేగాలనుకున్నా మ్యాట్ హెన్రీ(2-34) ఆ అవకాశమివ్వలేదు. అతడు వరుసగా రెండు వికెట్లు తీయడంతో ప్రొటీస్ జట్టు 169 పరుగులకే పరిమితమైంది.

## ఐసీసీ ర్యాంకింగ్స్‌లో సంజూ దూకుడు..

**ఒక్కసారిగా 25 స్థానాలు ఎగబాకాడు..!**



ఒక్కటంటే ఒక్క ఇన్నింగ్స్ చాలు.. క్రికెటర్ల జీవితమే మారిపోతుంది. జట్టును గెలిపించే చిరస్మరణీయ ఆటతో చరిత్రకెక్కిన ఆటగాళ్లు చాలామందే. ఇప్పుడు వారి జాబితాలో సంజూ శాంసన్(ఝఅయబ ఝఎంశీఅ) కూడా చేరిపోయాడు. టీ20 ప్రపంచకప్‌లో క్వార్టర్ ఫైనల్‌లాంటి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై శివాలెత్తిపోయిన శాంసన్ భారత జట్టుకు సెమీఫైనల్ బెర్తును కట్టబెట్టాడు. టీమిండియాను సెమీస్ చేర్చిన ఈ డాషింగ్ వ్యక్తిగతంగానూ మైలురాయి సాధించాడు. మొన్నటివరకూ ఎక్కడో 60ల్లో ఉన్న అతడు.. ఏకంగా 25 స్థానాలు ఎగబాకాడు. ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌పై చిరస్మరణీయ అర్ధ శతంతో భారత్‌ను గెలిపించిన సంజూ శాంసన్ ఐసీసీ టీ20 బ్యాటర్ల ర్యాంకిగ్స్‌లో ముందంజ వేశాడు. ఏకంగా.. 25 స్థానాలు మెరుగుపరచుకొని ప్రస్తుతం 40వ ర్యాంకులో కొనసాగుతున్నాడు. విండీస్‌పై 97 నాటౌట్.. ఆ ఒక్క ఇన్నింగ్స్ అతడిని టాప్-40లోకి తీసుకొచ్చింది. అయితే.. నంబర్ 1 బ్యాటర్‌గా వరల్డ్‌కప్‌లో చెలరేగి ఆడాల్సిన అభిషేక్ శర్మ ఫామ్ లేమితో పెద్ద ముప్పును ఎదుర్కొంటున్నాడు. పాకిస్థాన్ ఓపెనర్ షహిబ్జద ఫర్హాన్ అభికి ర్యాంక్‌కు పోటీగా మారాడు. పొట్టి కప్‌లో రెండు శతకాలతో పాక్ విజయాల్లో భాగమైన ఈ ఓపెనర్.. 848 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. అభిషేక్‌కు అతడికి 26 పాయింట్లే తేడా. ఇంగ్లండ్ హిట్టర్ ఫిల్ సాల్ట్ మూడో ర్యాంకులో ఉన్నాడు.

## కుటుంబంతో కలిసి సిద్ధి వినాయకుని దర్శించుకున్న గౌతమ్ గంభీర్.

భారత్ క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తన కుటుంబంతో కలిసి మహారాష్ట్ర రాజధాని ముంబై లోని శ్రీ సిద్ధి వినాయక ఆలయాన్ని సందర్శించారు. ఆ ఆలయంలోని సిద్ది వినాయక గణపతిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గంభీర్‌తో ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.కుటుంబంతో కలిసి ఆలయానికి చేరుకున్న గంభీర్‌కు అధికారులు సాధర స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వారితో పూజలు చేయించి, వేదమంత్రాలతో ఆశీర్వదించారు. గంభీర్ కుటుంబం సిద్ధి వినాయక ఆలయాన్ని సందర్శించిన దృశ్యాలను కింది వీడియోలో చూడవచ్చు..



# హాట్ హాట్ ఫొటోలతో హీట్ పెంచేస్తున్న నాని హీరోయిన్..




సినిమా ఇండస్ట్రీలో ఎంతో మంది కుర్ర హీరోయిన్స్ తమ అందచందాలతో ఆకట్టుకుంటున్నారు. అలాంటి వారిలో రుక్సార్ ధిల్లన్ ఒకరు. నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన కృష్ణార్జున యుద్ధం సినిమాతో మంచి క్రేజ్ తెచ్చుకుంది అందాల భామ రుక్సార్ ధిల్లన్.కృష్ణార్జున యుద్ధం సినిమాలో అందం, అభినయంతో ఆకట్టుకున్న ఈ వయ్యారి భామ. కృష్ణార్జున యుద్ధం సినిమాకంటే ముందు ఆకతాయి అనే సినిమాలో నటించింది. ఆ తర్వాత శిరీష్ హీరోగా నటించిన ఏబీసీడీ సినిమాలో నటించి మెప్పించింది రుక్సార్ ధిల్లన్.ఆ తర్వాత విశ్వక్ సేన్ సినిమాలో ఛాన్స్ అందుకుంది. అశోకవనంలో అర్జున కల్యాణం సినిమాతో మంచి హిట్ అందుకుంది. కానీ ఈ అమ్మడికి ఆశించిన స్థాయిలో అవకాశాలు రాలేదనే చెప్పాలి. ఆ తర్వాత స్పార్క్ సినిమాలో నటించి మెప్పించింది ఈ అందాల భామ. అయితే ఈ చిన్నది సాలిడ్ హిట్ మాత్రం అందుకోలేక పోయింది.దాంతో పాటు ఇప్పుడు ఈ బ్యూటీకి అవకాశాలు కూడా తగ్గిపోయాయి. దాంతో సినిమాల పరంగా ఈ చిన్నది ఎక్కడ కనిపించడం లేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం తన అందాలతో దుమారం రేపుతోంది. హాట్ హాట్ ఫొటోలతో హీట్ పెంచేస్తుంది. రెగ్యులర్ గా తన గ్లామరస్ ఫోటోలను పంచుకుంటూ కుర్రాళ్లకు నిద్రపట్టకుండా చేస్తోంది ఈ సుందరి. తాజాగా ఈ అమ్మడు కొన్ని ఫోటోలు వదిలింది. ఆ ఫోటోలు ఇప్పుడు కుర్రాళ్ళ గుండెల్లో బాణాలు గుచ్చుతున్నాయి. అలాగే క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్.




# పెద్ది' రికార్డ్స్ హంగామా..

## 24 గంటల్లో 46.1 మిలియన్ వ్యూస్‌తో 'రై రై రా రా' సంచలనం!

పాన్ ఇండియా స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విలేజ్ బ్యాక్‌డ్రాప్, ఎమోషన్, మాస్ ఎలిమెంట్స్ కలయికతో రూపొందుతున్న ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా విడుదలైన సెకండ్ సింగిల్ 'రై రై రా రా' లిరికల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారి రికార్డులు సృష్టిస్తోంది. ఈ పాటకు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చి స్వయంగా ఆలపించడం విశేషం. అనంత శ్రీరామ్ అందించిన సాహిత్యం మాస్, మోటివేషనల్ టచ్‌తో ఆకట్టుకుంటోంది. జానీ మాస్టర్ రూపొందించిన కొరియోగ్రఫీ ఈ సాంగ్‌కు హైలైట్‌గా నిలిచింది.ముఖ్యంగా రామ్ చరణ్ వేసిన గ్రేస్‌ఫుల్ స్టెప్పులు, ఫాస్ట్ మూమెంట్స్ అభిమానులను ఫిదా చేస్తున్నాయి. కొందరు అభిమానులు ఆయన డ్యాన్స్‌ను 'చిరుత' రోజుల్ని గుర్తు చేసేలా ఉందని సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. ఈ పాటపై మెగాస్టార్ చిరంజీవి కూడా ప్రశంసలు కురిపించారు. 'రై రై రా రా' సాంగ్ ఎనర్జీ, ఎమోషన్, సినీమాటిక్ బ్రిలియన్స్‌తో అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. రామ్ చరణ్ డ్యాన్స్ తనను ఎంతో గర్వపడేలా చేసిందని, స్క్రీన్‌పై ఆయన గ్రేస్ ప్రత్యేకంగా మెరిసిందని వ్యాఖ్యానించారు. దర్శకుడు బుచ్చిబాబు సానా, ఏఆర్ రెహమాన్ సంగీతం, జానీ మాస్టర్ కొరియోగ్రఫీ, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, లిరిసిస్ట్ అనంత శ్రీరామ్ అందరి కృషి వల్లే ఈ సాంగ్ మరోస్థాయికి వెళ్లిందని అభినందించారు. ఈ ప్రశంసలకు బుచ్చిబాబు సానా భావోద్వేగంగా స్పందిస్తూ, మెగాస్టార్ నుంచి వచ్చిన మాటలు జీవితాంతం గుర్తుండిపోతాయని తెలిపారు. రికార్డుల విషయానికి వస్తే, విడుదలైన 24 గంటల్లోనే 'రై రై రా రా' లిరికల్ వీడియో 46.1 మిలియన్ వ్యూస్ సాధించి టాలీవుడ్‌లో అత్యధిక వ్యూస్ అందుకున్న లిరికల్ సాంగ్‌గా నిలిచింది. మాస్ బీట్, ఎనర్జిటిక్ ట్యూన్, రామ్ చరణ్ డ్యాన్స్ అన్నీ కలిసి ఈ రికార్డు సాధించడంలో కీలక పాత్ర పోషించాయి.అయితే టాప్ లిరికల్ వ్యూస్ జాబితాలో రెండో స్థానంలో కూడా 'పెద్ది' చిత్రానికే చెందిన 'చికిరి చికిరి' పాట 29.19 మిలియన్ వ్యూస్‌తో నిలవడం విశేషం. మూడో స్థానంలో ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంలోని 'దేఖ్‌లేంగే సాలా' 28.53 మిలియన్ వ్యూస్ సాధించింది. నాలుగో స్థానంలో పుష్ప2 లోని 'కిస్సిక్' పాట 27.19 మిలియన్ వ్యూస్‌తో నిలిచింది. ఐదో స్థానంలో గేమ్ ఛేంజర్ చిత్రంలోని 'నా నా హైరానా' 23.44 మిలియన్ వ్యూస్ సాధించింది. ఆరో స్థానంలో ది ప్యారడైజ్ చిత్రంలోని 'ఆయా షేర్' పాట 21.74 మిలియన్ వ్యూస్‌తో నిలిచింది.మొత్తానికి, టాలీవుడ్‌లో ఇప్పుడు లిరికల్ వీడియోలు కూడా సినిమా ప్రమోషన్‌లో కీలక పాత్ర పోషిస్తున్నాయి.




# యశ్ టాక్సిస్ జూన్‌కి వాయిదా

యశ్ హీరోగా రానున్న తాజా సినిమా 'టాక్సిక్' గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. 'ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్అప్స్' అనేది ఉప శీర్షిక. భారీ స్థాయిలో రూపొందుతోన్న ఈ చిత్రం వాయిదా పడింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ ఓ పోస్ట్ పెట్టింది. మొదట ఈ మూవీని మార్చి 19న విడుదల చేయాలని భావించారు. కానీ, ప్రస్తుతం పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా దీన్ని జూన్ 4కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. 'మేం ఈ 'టాక్సిక్'ను అన్ని భాషల్లో విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లిష్‌లోనూ రిలీజ్ చేయాలి. ప్రస్తుతం పశ్చిమాసియాలో పరిస్థితులు అందరికీ తెలిసినవే. ఇలాంటి సమయంలో సినిమాను విడుదల చేయడం సరైన నిర్ణయం కాదు. అందుకే వాయిదా వేస్తున్నాం' అని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఇక ఇందులో యశ్‌తో పాటు అయిదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించ నుండగా హ్యూమా ఖురేషీ ఎలిజిబెత్‌గా, నయనతార గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా అలరించనున్నారు. మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ ఆకట్టుకోనున్నారు. ఇటీవల విడుదలైన టీజర్ చర్చనీయాంశమైన విషయం తెలిసిందే.

# నెట్టింట పిచ్చెక్కిస్తున్న అందాల ముద్దుగుమ్మ..

బుల్లితెరపై తనకంటూ మంచి క్రేజ్ సొంతం చేసుకుంది దీపికా పిల్లి. ఒకప్పుడు టిక్ టాక్ వీడియోస్ చేసి విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఇక అదే ఫేమ్ తో బుల్లితెరపైకి అడుగుపెట్టింది. పలు షోలలో యాంకరింగ్ చేస్తూ అలరించింది.తక్కువ సమయంలోనే తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు కథానాయికగా మారిన సంగతి తెలిసిందే. జబర్దస్త్, డీ షోలలో యాంకర్ గా మెరిసిన దీపికా.. ఆ తర్వాత వాంటెడ్ పండుగాడు సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది.ఈ సినిమాతోపాటు యాంకర్ ప్రదీప్ మాచిరాజుతో కలిసి అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమాలోనూ నటించింది. అయితే ఈ రెండు చిత్రాలు పెద్దగా ఆడలేదు. అందం, అభినయంతో ప్రేక్షకుల హృదయాల్లో చోటు సంపాదించుకుంది. ఈ అమ్మడు నెట్టింట చాలా యాక్టివ్.అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమా తర్వాత ఇండస్ట్రీలో దీపికా సైలెంట్ అయ్యింది. అటు బుల్లితెరపై కూడా కనిపించడం లేదు. తాజాగా ఈ అమ్మడు తన ఇన్ స్టాలో షేర్ చేసిన ఫోటోస్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.పింక్ కలర్ లెహంగాలో మరింత అందంగా కనిపిస్తుంది దీపికా. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మకు ఇన్ స్టాలో 2.1 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారంటే ఈ బ్యూటీకి ఏ స్థాయిలో క్రేజ్ ఉందో చెప్పక్కర్లేదు. ప్రస్తుతం ఈ అమ్మడు తెలుగులో సరైన అవకాశాల కోసం వెయిట్ చేస్తున్నట్లు తెలుస్తోంది.



# మణిపురి బూంగ్‌కు బ్రిటిష్ అకాడమీ అవార్డు




మణిపురి భాషలో తెరకెక్కిన 'బూంగ్' చిత్రం ప్రతిష్టాత్మకమైన బ్రిటీష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్ 2026 అవార్డుల్లో సత్తా చాటిన సంగతి తెలిసిందే. ఈ చిత్రం 'బెస్ట్ చిల్డ్రన్ అండ్ ఫ్యామిలీ ఫిల్మ్' కేటగిరీలో విజేతగా నిలవడమే కాకుండా బాఎ÷-టా గెలుచుకున్న తొలి భారతీయ సినిమాగా చరిత్ర సృష్టించింది. ఈ అద్భుత విజయం తర్వాత మేకర్స్ ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీతో పాటు ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ప్రపంచ వేదికపై భారతీయ ప్రాంతీయ సినిమా సత్తాను చాటిన ఈ చిత్రం మార్చి 6న థియేటర్లలోకి రాబోతుంది. ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ప్రముఖ నిర్మాతలు ఫర్హాన్ అక్తర్, రితేష్ సిధ్వానీ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించగా, లక్ష్మీప్రియ దేవి దర్శకత్వం వహించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే, మణిపూర్‌లోని ఒక మారుమూల గ్రామానికి చెందిన 'బూంగ్' అనే చిన్నారి చుట్టూ కథ తిరుగుతుంది. తన తల్లి ముఖంలో చిరునవ్వు చూడాలని తపించే ఆ బాలుడు, ఆమెకు ఇచ్చే అత్యంత విలువైన బహుమతి తన తండ్రిని తిరిగి ఇంటికి తీసుకురావడమేనని బలంగా నమ్ముతాడు. ఈ క్రమంలో తన స్నేహితుడితో కలిసి తండ్రి కోసం అతడు చేసే అన్వేషణ, ఆ ప్రయాణంలో ఎదురయ్యే అనుభవాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. దర్శకురాలు లక్ష్మీప్రియ దేవి చిన్నపిల్లల అమాయకత్వాన్ని, వారిలోని స్వచ్ఛమైన ప్రేమను అత్యంత సహజంగా వెండితెరపై ఆవిష్కరించారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com